అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 18-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 8 సంచిక : 333 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

కార్మిక సమస్యలపై సీఎం స్పందించాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్



నవతెలంగాణ-కొత్తగూడెం

సీఎం కేసీఆర్ ఖమ్మం రానున్న సందర్భంగా కార్మిక సమస్యలపై స్పందించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గోదావరిఖని ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు యాజమాన్యం రూ.500 కోట్లు ఇస్తున్నందున, కోల్‌బెల్టు ప్రాంతంలోని కలుషిత నీరు కాకుండా మిషన్ భగీరథ నీరు ఇవ్వాలన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో ఆర్ఎల్‌సీ సమక్షంలో అగ్రిమెంట్ చేసిన మారు పేర్లు, అండర్ గ్రౌండ్ అన్ ఫిట్ యైన మైనింగ్, ట్రేడ్స్ మెన్, ఈపి ఆపరేటర్స్‌కు సూటబుల్ జాబ్ కల్పించే అంశంలపై యాజమాన్యం సర్క్యులర్లు విడుదల చేయడంలో జాప్యంపై, సింగరేణి ప్రాంతాల్లో పట్టాలు ఇస్తున్న ప్రభుత్వం కార్మికుల చిరకాల కోరిక అయిన సొంతింటి కల నెరవేర్చడం కోసం ఎవరి క్వార్టర్ వారికే ఇవ్వాలని, లేదా 240 గజాల ఖాళీ స్థలం ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో ఐటీ మాఫీ గురించి తీర్మానం చేసి చిత్తశుద్ధి చాటుకున్న తెలంగాణ ప్రభుత్వం, కోల్ ఇండియాలో చెల్లిస్తున్న విధంగా అలవెన్స్‌లపై ఐటి మాఫీ చేయాలన్న అగ్రిమెంట్ పై స్పందించి కార్మికులకు తీపి కబురు ఇచ్చి కార్మిక పక్షపాతిగా ముఖ్యమంత్రి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రామయ్యను దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఉపాలయంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

ఆటో-ద్విచక్ర వాహనం ఢీ

- ఐదుగురికి గాయాలు
- ఒకరికి విషమం

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆటో-ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలు కాగా వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం... పరిధిలోని వినాయకపురంలో మంగళవారం ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో వినాయకపురం గ్రామానికి చెందిన గజ్జల హేమంత్, సుమంత్, తేజేశ్వర్‌లు ద్విచక్రవాహనం పై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా, ఇదే సమయంలో ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి ఢీ కొట్టారు. దాంతో ఆటోలో ఉన్న వినాయకపురం కాలనీకి చెందిన గడ్డం శ్రీను, సత్య సాయికి గాయాలైయ్యాయి. ఇందులో గజ్జల హేమంత్ అనే యువకుడి తలకు బలమైన గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలైయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి తరలించగా, బలమైన గాయాలైన హేమంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రి కి తరలించారు.

నేడు తుది సంసిద్ధత సమీక్షా సమావేశం

- వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలి
- కలెక్టర్ అనుదీప్

నవతెలంగాణ-పాల్వంచ

ఈ నెల 19వ తేదీ నుండి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి తుది సంసిద్ధతను సమీక్షించేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌నకు అధికారులు హాజరు కావాలని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, 48 కంటి వెలుగు కేంద్రాల వైద్యులు, నేత్ర వైద్య నిపుణులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, ఏపీఎంలు, ఎస్ఆర్పీలు ఏర్పాట్లుకు సంబంధించిన సమగ్ర సమాచారంతో వీడియో కాన్ఫెరెన్స్‌కు హాజరు కావాలని తెలిపారు.

టీఈఈ యూనియన్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-మణుగూరు

టీఈఈ 1104 యూనియన్ డైరిని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజనీర్ ఛాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బిటిపిఎస్ రీజీనల్ ప్రెసిడెంట్ హేమ్లా నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిచ్చన్న మాట్లాడుతూ టిఈఈ 1104 యూనియన్ ఉన్నత విలువలు కలిగిన కార్మిక సంఘం అని అన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సంస్థ రక్షణ కోసం పాటుపడాలన్నారు. ఉద్యోగ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం చీఫ్ ఇంజనీర్‌ని శాలువ బోకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమ్లా నాయక్ మాట్లాడుతూ 1104 యూనియన్ డైరీ అత్యంత విలువైనదని, మత గ్రంథాలకు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో చట్టాలు, విధి విధానాలు, జీవోలతో నిండిన 1104 డైరీకి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్రామ్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ సునిత, యూనియన్ సీనియర్ నాయకులు సంగయ్య వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

యాదవ్, కురుమలకు గొర్రెల బదులు నగదు బదిలీ చేయాలి

- బీఆర్ఎస్ సభలో సీఎం ప్రకటన చేయాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం యాదవ్, కురుమల అకౌంట్‌లలోకి డైరెక్ట్‌గా నగదు బదిలీ చేయడం ద్వారా మాత్రమే అవినీతికి తావు లేకుండా కుటుంబాలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం మునుగోడులో ప్రకటించిన నగదు బదిలీ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కమిటీ సభ్యులు బొల్లి సత్యనారాయణ, కుమ్మరి కుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం తూరుబాక గ్రామంలో జరిగిన గొర్రెల మేకల సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. డీడీలు కట్టించుకొని ప్రభుత్వమే గొర్రెల పంపిణీ చేయడం వలన ఎక్కడో వేరే ప్రాంతాల్లో పెరిగిన గొర్రెలు ఈ ప్రాంతంలోకి తీసుకురావడం వలన ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోలేక అవి మరణిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నలగట్ల ప్రభాకర్, బూడిద ప్రసాద్, చిలక వెంకన్న, వీరస్వామి, ఐనబోయిన శ్రీను, కుమ్మరికుంట ప్రవీణ్, నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా చంద్రుగొండ మండలం

- జిల్లా సీనియర్ నాయకులు చంద్రవిజయ్

నవతెలంగాణ-చంద్రుగొండ

కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా చంద్రుగొండ మండలం ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు చంద్రువిజయ్ అన్నారు. మండల పరిధిలోని మద్దుకూరు గ్రామంలో మంగళవారం తన నివాసంలో మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. స్థానిక జడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డి నాయకత్వంలో ఎలాంటి విభేదాలకు తావు లేకుండా సమన్వయంతో పని చేయడం జరుగుతుందని, రాబోయే ఎన్నికలకు పార్టీని బలోపేత దిశగా నడిపిస్తామని అన్నారు. మద్దుకూరు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎలుక రాజేశ్వరరావు నియమితులయ్యారని అన్నారు. ఈ సందర్భంగా ఎలుక రాజేశ్వరరావు మాట్లాడుతూ నాకు కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా పదవి ఇచ్చినందుకు జడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రు విజయ్ పలువురికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ సభకు ప్రతీ కార్యకర్త తరలి రావాలి

నవతెలంగాణ-పినపాక

ఖమ్మం పట్టణంలో నేడు జరగనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు పినపాక మండలం నుంచి ప్రజలు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావాలని ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య, సహకార సంఘం చైర్మన్ కోరారు. మంగళవారం జానంపేట రైతు వేదికలో స్థానిక సర్పంచ్ బాడిస మహేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రయోజనాల కోసం ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు మండలం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరించిన జేసీ

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఐటీయూ జిల్లా కమిటీ ముద్రించిన 2023 నూతన సంవత్సర వాల్ క్యాలెండర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాలెండర్లను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో సీఐటీయూ ఆవిర్భవించిందని దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యత కోసం దేశ సంక్షేమం కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సిఐటియు సంఘటిత, అసంఘటిత రంగాలు, స్కీం వర్కర్లలో బలమైన శక్తిగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, డి.వీరన్న యూఈఈయు రాష్ట్ర నాయకులు అంకిరెడ్డి నరసింహారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, జి.రాములు, తేజావత్ వెంకన్న, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-బూర్గంపాడు

గోదావరి వరదల సమయంలో సీఎం కేసీఆర్ వరద బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జరగబోయే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రకటించాలని ఆయన అన్నారు. ఐటీసీపీఎస్‌పీడీ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఇరవెండి, మోతే, సుందరయ్య నగర్, గణేష్ కాలనీ, పాత సారపాక, బసప్ప క్యాంపు, భాస్కర్ నగర్, గాంధీనగర్, నాగినేనిప్రోలు రెడ్డి పాలెం ఈ గ్రామాలకు కరకట్ట నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రూ.1200 కోట్లు కరకట్టుకు ప్రకటించారని, అది అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. బూర్గం పాడు గ్రామం పూర్తిగా మునిగి పోయ్యే పరిస్థితి ఉందని, వరద బాధితులకు మెరక ప్రాంతంలో డబుల్ బెడ రూమ్ నిర్మించాలని ఆయన అన్నారు. అదేవిధంగా నష్ట పరిహారం ఆయన కోరారు.

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు

- స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా పాత్రికేయులకు ఇంటి స్థలాల వెంటనే అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెం రామవరం గోధుమ వాగు ఒడ్డున ఉన్న సింగరేణి ఖాళీ స్థలాన్ని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావులు పరిశీలించారు. ఉన్న స్థలంలో ఉప్పటికే కోర్టుభవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించారు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న స్థలం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన పాత్రికేయులకు అందజేస్తామని, డీపీఆర్ఓ నుండి పూర్తి వివరాలుసేకరించాలని అధికానులను ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చడం చాలా సంతోషంగా ఉంది : ఎమ్మెల్యే వనమా

సీఎం కేసీఆర్ పాత్రికేయులకు ఇచ్చిన మాటా నేరవేర్చడం తమ కెంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టర్ అనుదీప్‌తో కలసి సింగరేణి స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఇచ్చిన ఆదేశం ప్రకారం రెండు నెలలో పాత్రికేయులకు ఇంటి స్థలాలకు కేటాయించిన 10 ఎకరాల భూమిని పరిశీలించామని, వెంటనే ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేసీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, తహసీల్దార్లు రామకృష్ణ, కృష్ణ ప్రసాద్, సింగరేణి స్టేట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలి

- వరద ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకోవాలి
- పౌర హక్కుల సంఘం సీఎల్‌సీ నిజ నిర్ధారణ బృందం



నవతెలంగాణ-బూర్గంపాడు

గోదావరి వరద ముంపు బాధితులను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల ఆదుకోవాలని పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ బృందం కోరింది. మంగళవారం భద్రాచలం క్రాస్ రోడ్డు సమీప నిర్వాసిత గుడిసె వాసులను పౌర హక్కుల సంఘం నాయకుల బృందం సందర్శించింది. నిర్వాసితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవికుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్.ఉపేందర్ రావు, కార్యదర్శి కే.శ్రీనివాసులు మాట్లాడారు. నిర్వాసితుల్లోని ఆదివాసీలకు ఎటువంటి షరతులు లేకుండా పక్క భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో సీఎం కేసీఆర్ సందర్శించి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్స్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని వారు కోరారు. దళితులు, మైనార్టీ, బీసీ, పేదలందరికీ ప్రాథమిక అవసరాలు, కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వ మీద ఉంటుందన్నారు. శాంతి యుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాసితులపై ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు నిరంకుశంగా దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా పరిగణిస్తున్నట్టు సీఎల్‌సీ నాయకులు పేర్కొన్నారు. ఈ నిజ నిర్ధారణ ద్వారా వచ్చిన అంశాలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవికుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్.ఉపేందర్ రావు, కార్యదర్శి కే.శ్రీనివాస్ నాయకులు దుర్గా రెడ్డి, రమణ, మోహన్, సాగర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గనైజేషన్‌ను అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గనైజేషన్ ద్వారా జరిగిన అనేక సేవా కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఉత్తమ సేవ అవార్డు వచ్చిన శుభ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్పర్సన్ సొసైటీ సభ్యులను మంగళవారం అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం నూతన కలెక్టరేట్‌కి వెళ్లి కలెక్టర్ అభినందనలు తెలియజేస్తూ జిల్లాకు దక్కిన ఉత్తమ సేవ అవార్డు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మంచి వైద్యం అందించాలని, ఒక భవనం నూతన నిర్మాణం రూ.35 లక్షలు వ్యయంతో జరుగుచున్నదని, భద్రాచలం ప్రాంతంలో వరదలు వలన జరిగిన నష్ట బాధితులను ఆదుకోవాలని, వారికి కావలసిన స్టీలు సామగ్రి, ఇతర అవసరాలు సామగ్రికి రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎస్ఎల్ కాంతారావు, కోశాధికారి జి.రాజిరెడ్డి, వై.సూర్యనారాయణ, ఆరుద్ర సత్యనారాయణ, బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా ఆవిర్భవించన నేపథ్యంలో నేడు జరగనున్న భారీ బహిరంగ సభ చరిత్ర సృష్టించనుందని ఎమ్మెల్యే హరిప్రియ, వైద్య ఆరోగ్యశాఖ ఇన్ఫ్రా డెవలప్మెంట్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నప్పటికీ దేశంలో ప్రజలకు నేటికీ విద్యుత్తు మంచినీరు, సాగునీరు కల్పించలేకపోయారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన అనంతరం రెండు విడతలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో సేవ చేసామని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకున్నామన్నారు. నేడు ఈ పథకాల అమలు కోసం దేశమంతా తెలంగాణ వైపు చూస్తోంద న్నారు. దేశానికి బీఆర్ఎస్ అవసరం ఏర్పడింద న్నారు. నేను జగనన్న సభ మలుపు తిప్పే సభ అన్నారు.

నియోజకవర్గ నుండి 1500 వాహనాల్లో 49,926 మంది

నేడు ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు ఇల్లందు నియోజకవర్గం నుండి 1500 వాహనాల్లో 54 వేల మంది సభకు హాజరుకానున్నారని తెలిపారు. కామేపల్లి మండలం నుండి 380వాహనాల్లో 11,560, బయ్యారం మండలం నుండి 118వాహనాల్లో 7,110, గార్ల మండలం నుండి 374వాహనాల్లో 8,346, టేకులపల్లి మండలం నుండి 269 వాహనాల్లో 7,950, మున్సిపాలిటీలో 24 వార్డుల నుండి 420 వాహనాల్లో 6,870, రూరల్ నుండి 180 వాహనాల్లో 8,080 మొత్తం నియోజవర్గం నుండి 49,926మంది సభకు హాజరుకానున్నారని తెలిపారు. మరో ఐదు వేల వరకు అదనంగా వచ్చే అవకాశం ఉందన్నారు. సభ విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హర్సింగ్ నాయక్, ఐదు మండలాల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, రైతు సంఘం రాష్ట్ర నేత పుగళ్ళ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాలలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టనున్న ఖమ్మం సభ

- విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు



నవతెలంగాణ-మణుగూరు

నేడు ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ దేశ రాజకీయాలలో మార్పులకు శ్రీకారం చుడుతుందని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాగుతూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఏర్పాటయ్యాక నేడు ఖమ్మంలో మొట్టమొదటిసారిగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఖమ్మం సభతో దేశ రాజకీయాలలో పెను మార్పులు వస్తాయన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రంలో తెలంగాణలో అమలవుతున్న పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలకులు కేవలం తమ పార్టీ నాయకులకు మాత్రమే పథకాలు అందించారన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పథకం పేద వాడికి నేరుగా వారి ఖాతాలో వెళ్తుందన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటుగా మరో నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రి హాజరవుతున్నారన్నారు. భారీ బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



కురుమల అభివృద్ధికి కృషి

- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్రంలో ఉన్న కురుమల అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ చేవెళ్లి సంపత్ అన్నారు. పట్టణంలోని 13వవార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ, కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు పష్పగుచ్చాలు ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘ జిల్లా నేతలు అమ్రేజు కొమరయ్య, సంఘం పట్టణ అధ్యక్షకార్యదర్శులు వీరస్వామి, సర్వేశం, కోషాధికారి వెంగళ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలను కలిసిన దొబ్బల వెంకటప్పయ్య

నవతెలంగాణ-మణుగూరు

బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మణుగూరు బీఆర్ఎస్ నేత, మాజీ సర్పంచ్, మాజీ రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ దొబ్బల వెంకటప్పయ్య (డివి) తుమ్మలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తుమ్మల నివాసం గండగలపాడులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తుమ్మలను నాయకులు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తుమ్మల ఉద్యమ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన ఉద్యమ స్ఫూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీవి, తదితరులు ఉన్నారు.

పీఆర్సీ, ప్రమోషన్స్ వెంటనే ప్రకటించాలి

- ఎలక్ట్రికల్ ఎస్సి కార్యాలయం ఎదుట యూఇఇయూ ధర్నా



నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022 ఏప్రిల్ నెల నుండి రావాల్సిన పిఆర్సిని వెంటనే ప్రకటించాలని ఎన్పీడీసీఎల్ పరిధిలో జేఎల్ఎం టు ఏఎల్ఎం ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని 2016 సంవత్సరంలో 2367 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజెన్స్‌గా మార్పు చేశారని ఈ ఆర్టిజన్స్ అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, యూఈఈయూ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొలగాని రమేష్, బొల్లి వెంకటరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్‌సిను ప్రకటించడంలో జాప్యం చేయటం వల్ల విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. సంస్థలు మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న 6500 మంది పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000లు ప్రకటించి వారిని సంస్థలు ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కా రంలో సవితి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శి ంచారు. ధర్నా అనంతరం ఎస్ఈకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు అంకిరెడ్డి నరసింహారావు, జిల్లా నాయకులు పులి గణేష్, పదిలం శ్రీనివాస్, జి.వెంకన్న, కె.వెంకటేశ్వర్లు, బి.రమేష్, ప్రదీప్ కుమార్ చలమయ్య, రాంకుమార్, రాఘవేందర్ రావు, జెకె.శ్రీను, తేజ, రామకృష్ణ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ 2,3,4 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- ఎస్సీ అభ్యర్థుల నుండి దరఖాస్తు ఆహ్వానం
- కలెక్టర్ అనుదీప్

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్ 2,3,4 తదితర పోటీ పరీక్షలకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ అనుదీప్ మంగళవారం తెలిపారు. ఈ శిక్షణకు 100 మంది ఎస్సీ అభ్యర్థులకు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు www.tsstudycircle.co.in వెబ్సైట్ ద్వారా ఈనెల 17 నుండి 301 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఫిబ్రవరి 6 నుండి మే 5 వరకు మూడు నెలల ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన విద్య ర్హతలు బీఏ, బీఎస్‌సీ, బీకం, బీటెక్, బీఎస్‌సీ, (ఏజి)బి ఫార్మసీ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఎస్సీ అభ్యర్థులై ఉండాలన్నారు. ఆన్లైన్ ద్వారా అప్లికేషన్స్ అప్లికేషన్స్ చేసుకోవాలని ఆదాయం అభ్యర్థుల తల్లిదండ్రులు గార్డియన్ వార్షిక ఆదాయం మూడు లక్షలకు మించరాదని, జనవరి 15, 2022 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రములు సమర్పించాలన్నారు. సెలక్షన్స్ విధానం డిగ్రీలో వచ్చిన మార్పులు ఆధారంగా అభ్యర్థికి ప్రవేశం కల్పిస్తారని మొత్తం 100 సీట్లలో 33.33శాతం మహిళలకు ఐదు శాతం దివ్యాంగులకు రిజర్వ్ చేయబడిందని చెప్పారు. గతంలో ఎస్సీ స్టడీ సర్కిల్లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో గాని హైదరాబాద్ సివిల్ సర్వీసెస్లో గాని లేదా ఏ ఇతర ప్రభుత్వ సంస్థలలో గాని కోచింగ్ తీసుకున్న వాళ్లు ఈ కోచింగ్‌కు అనర్హులు అని చెప్పారు. శిక్షణ కాలంలో భోజన వసతి లేకుండా మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ విధానంలో గ్రూప్స్ కోచింగ్‌తో పాటు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని హాజరైన రోజులకు ఒక్కొక్కరికి రోజుకు టీ, మధ్యాహ్నం భోజనం నిమిత్తం రూ.75 చెల్లిస్తారని దీనితోపాటు రూ.1500 విలువగల మెటీరియల్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర సమాచారం కోసం పి.వెంకట్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ 9494306260 అలాగే ఈ శివ భాస్కర్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సెల్ నెంబర్ 9441079188 తెలుసుకోవాలన్నారు.



కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో ఈ నెల 19వ తేదీ నుండి చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం భద్రాచలం ఆర్డీవో రత్నకుమారి పరిశీలించారు. తొలుత మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సందర్శించిన అనంతరం తిరుమల గూడెం తండాలో ఏర్పాటుచేసిన కేంద్రాన్నీ పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. కంటి వెలుగు కేంద్రాలకు కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట తహశీల్దార్ వి.సురేష్ కుమార్, ఎండిఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, డీటీ మనిధర్, ఆర్ఐ నాగమణి ఉన్నారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 18-01-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 333 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

హైదరాబాద్‌లో వన్డే ధమాకా



భారత్, న్యూజిలాండ్ ఢీ నేడు

నవతెలంగాణ-హైదరాబాద్ : ఐదు నెలల వ్యవధిలోనే హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ క్రికెట్ సందడికి వేదికైంది. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో టీ20 మ్యాచ్ జరుగగా.. తాజాగా న్యూజిలాండ్‌తో వన్డే సమరానికి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా నిలువనుంది. హైదరాబాద్ వన్డే ధమాకా కోసం న్యూజిలాండ్ జట్టు మూడు రోజుల ముందే నగరానికి చేరుకోగా.. భారత జట్టు సోమవారం ఇక్కడికి చేరుకుంది. వన్డే ధమాకా ముంగిట మంగళవారం ఇరు జట్లు సెషన్ల వారీగా ప్రాక్టీస్ సెషన్లో చెమటోడ్చాయి. ఉప్పల్ స్టేడియం ఇప్పటివరకు ఆరు వన్డేలకు ఆతిథ్యం వహించగా.. ఇది ఇక్కడ

...8లో

రూ.12 లక్షల కోట్లు అదృశ్యం!

మోడీ సర్కార్ 8ఏండ్ల పాలనలో రికార్డుస్థాయిలో ఎన్‌పీఏలు

- మొత్తం రుణాల్లో ఎన్‌పీఏలు 6.5శాతం
- అత్యంత రహస్యంగా.. రైట్ ఆఫ్ : రాజకీయ విశ్లేషకులు
- యుపీఏ హయాంలో బ్యాంకులకు ఏటా రూ.50వేల కోట్ల లాభాలు
- ఇప్పుడు ఏటా రూ.2లక్షల కోట్ల నష్టాలు..

దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగాన్ని అతలాకుతలం చేస్తున్న అంశం 'మొండి బకాయిలు' (ఎన్‌పీఏ). మార్చి 2014న ఎన్‌పీఏలు రూ.2.51లక్షల కోట్లు. 2021-22నాటికి రూ.14.5లక్షల కోట్లకు చేరుకుంది. ఇందులో బడా కార్పొరేట్లు తీసుకున్న దాదాపు రూ.12లక్షల కోట్లు ఒక పద్ధతి ప్రకారం ఎన్‌పీఏలుగా మారాయి. ఇవి ఒక ప్రణాళిక, వ్యూహం ప్రకారం అత్యంత రహస్యంగా రైట్ ఆఫ్ అవుతున్నాయని బ్యాంకింగ్ రంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. మోడీ సర్కార్ అండదండలతోనే ఇదంతా జరుగుతోందన్నది బహిరంగ రహస్యం. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉండాల్సిన లక్షల కోట్లు.. కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిందని, సడిచప్పుడూ లేకుండా.. వ్యవహారాలు(ఎన్‌పీఏలుగా ముగించటం) నడుస్తున్నాయని ఆరోపణలున్నాయి.





న్యూఢిల్లీ : మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చింది మొదలు దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలకు పండగే పండగ. మోడీ సర్కార్ ఆర్థిక విధానాలతోనే నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ వంటి ఆర్థిక నేరగాళ్లకు వేల కోట్లు రుణాలు అందాయి. అదంతా ఎగ్గొట్టి.. విదేశాలకు ఎగిరిపోయారు. ఈ రుణ ఖాతాల వివరాలు ఎవ్వరికీ తెలియదు. ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడు అయిన అనిల్ అంబానీ వ్యాపార సంస్థలకు బ్యాంకుల నుంచి దాదాపు రూ.1లక్ష కోట్ల రుణాలు అందాయి. ఇదంతా కూడా ఎన్‌పీఏగా మారింది. ఈ కేసుపై కేంద్రం నోరు మెదపటం లేదు. ఈడీ, సీబీఐ, ఇన్‌కం ట్యాక్స్.. ఇవేవీ దాడులు చేయవు. విచారణ చేపట్టవు. డీహెచ్ఎఫ్ఎల్ తీసుకున్న రూ.35వేల కోట్లు ఎన్‌పీఏలుగా మారాయి. 17 బ్యాంకులకు నష్టం. గుజరాత్‌కు చెందిన ఏబీజీ షిప్‌యార్డ్ 28 బ్యాంకులకు రూ.23వేల కోట్లు ఎగ్గొట్టింది. రిలయన్స్, వేదాంత, ఆర్సెలర్ మిట్టల్, టాటా, పిరామల్.. మొదలైన కంపెనీలకు 'రైట్ ఆఫ్'లతో పెద్ద ఎత్తున లబ్ది చేకూరిందని ఆరోపణలున్నాయి.

ఏ దేశంలోనూ ఇలా లేదు

ప్రపంచంలో ఏ దేశంలోనూ జరగని వ్యవహారం. బడా కార్పొరేట్లు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు చాలా నిశ్శబ్దంగా ఎన్‌పీఏలుగా మారుతున్నాయి. మొండి బకాయిలేవీ ఇక తిరిగిరావని ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ఉన్నతాధికారులు చెబుతున్నారు. చట్టబద్ధంగా రుణాలు అందాయనీ, చట్టబద్ధమైన పద్ధతిలోనే వారి రుణాలు 'రైట్ ఆఫ్' అయ్యాయని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇలా జరగటం వెనుక.. రాజకీయ అధికార బలం ఉందని తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వ అండదండలు లేకుండా వేల కోట్లు, లక్షల కోట్లు 'రైట్ ఆఫ్' కావని, ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు.

వెసులుబాటు ఇచ్చినా..

ఏదైనా రుణ ఖాతా బకాయిలు చెల్లింపు 90 రోజులు జరగకపోతే అది 'ఎన్‌పీఏ'గా మారినట్టే. అయితే రుణ వాయిదాలు, బకాయిల చెల్లింపులకు బ్యాంకులు అనేక అవకాశాలు ఇస్తాయి. అయినా చెల్లంపులు లేకపోతే వాటిని వివిధ కేటగిరీలుగా వర్గీకరిస్తుంది. మొదట 'సబ్ స్టాండర్డ్'గా పేర్కొంటాయి. తర్వాత 'డౌట్‌ఫుల్ లెవల్-1', ఆ తర్వాత లెవల్-3గా మారుస్తాయి. చివరికి 'లాస్ అస్సెట్'గా చూపుతాయి. తుది దశ రైట్ ఆఫ్‌కు రావడానికి దాదాపు 4 ఏండ్లు పడుతుంది. ఈ కాలంలో బ్యాంకుల కన్సార్టియం అనేక సంప్రదింపులు, చర్యలు చేపడుతుంది. రుణ ఖాతాలో వడ్డీలు, ఇతర రుసుములు మొత్తంగా మాఫీ చేసి..అసలు కట్టాలని

...8లో

నేడే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ

ఖమ్మం గులాబీమయం

- నూతన కలెక్టరేట్ వద్ద సిద్ధమైన సభా ప్రాంగణం
- నలుగురు సీఎంలు రానుండటంతో భారీ భద్రత
- అక్కడే కంటివెలుగుకు శ్రీకారం
- 5200 మంది పోలీసులతో భద్రత కట్టుదిట్టం
- ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్ మళ్లింపు





నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం గులాబీమయమైంది. ఎటుచూసినా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు, తోరణాలు, బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. నగరంలో ప్రతి పది మీటర్లకు ఓ ఫ్లెక్సీ.. భారీ కటౌట్లు ఏర్పాటుచేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ సందర్భంగా ఖమ్మంలో బుధవారం భారీ బహిరంగసభ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సభను ఐదు లక్షల మందితో నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సభకు తెలంగాణ, కేరళ, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, పినరయ్ విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌మాన్ సింగ్‌తో పాటు యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎం), సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నారు. సభా ప్రాంగణంలో సంబంధిత సీఎంలు, ముఖ్యనాయకుల కటౌట్లతో అలంకరించారు. స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించనున్నారు. అదేవిధంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

సిద్ధమైన సభాప్రాంగణం..

నూతన కలెక్టరేట్ ఎదుట ఇప్పటికే సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ప్రాంగణాన్ని స్థల అనుకూలతను బట్టి సెక్టార్లుగా విభజించారు. 5వేలు మొదలు 50వేల వరకు ఒక్కో సెక్టార్ సామర్థ్యం ఉండేలా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రుల పర్యటన షెడ్యూల్‌ను బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసింది. రెండు హెలికాప్టర్లలో సీఎంలు సభాస్థలికి చేరుకుంటారని నేతలు

...8లో

భారత్‌లోనూ బ్రెజిల్ పరిణామాలు

ప్రజలే అప్రమత్తంగా ఉండాలి

- ఎస్వీకే వెబినార్‌లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారతదేశంలోనూ బ్రెజిల్ తరహా పరిణామాలు సంభవించే ప్రమాదం ఉన్నదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ హెచ్చరించారు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సనారో అవలంబించిన విధానాలనే భారతదేశంలోనూ ప్రధాని నరేంద్రమోడీ అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో ట్రంప్ ఓటమి పాలయ్యాక, అక్కడి పార్లమెంటు భవనంపై ఆయన మద్దతు దారులు దాడులు చేశారనీ, అదే తరహాలో ఇప్పుడు బ్రెజిల్‌లోనూ బోల్సనారో మద్దతు దారులు దాడులకు తెగబడ్డారని వివరించారు. అమెరికా, బ్రెజిల్ ఆర్థిక విధానాలు ఒక్కటేననీ, ఇప్పుడు భారతదేశ ఆర్థిక విధానాలు కూడా వాటికోవలోనే ఉన్నాయని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "బ్రెజిల్ ప్రజాతీర్పు. వ్యతిరేకిస్తున్నదెవరు? కారణాలేంటి?" అంశంపై మంగళవారం జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. ట్రంప్, బోల్సనారో ఇద్దరికి ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థలపై నమ్మకం లేదనీ, అందుకే ఆ వ్యవస్థల్ని సాధ్యమైనంత ఎక్కువగా నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. ఇప్పుడు

...8లో

ఇక ప్రతి నెలా విద్యుత్

చార్జీల పెంపు

కొత్త నిబంధనలతో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

న్యూఢిల్లీ : విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కొత్త నిబంధనలు తీసుకొస్తుంది. విద్యుత్ చట్టసవరణ బిల్లు-2020కు పార్లమెంట్ ఆమోదం పొందకపోయినా దొడ్డిదారిలో భారాలు మోపుతోంది. ప్రతి నెల ట్రూ అప్ భారం ప్రజలపై మోపేందుకు కొత్త నిబంధనను కేంద్రప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ మేరకు విద్యుత్ నిబంధన చట్టం-2005లోని నిబంధనలు మారుస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ డిసెంబర్ 29వ తేదితో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తన వెబ్‌సైట్‌లో ఆలస్యంగా పొందుపరిచింది. ఈ నోటిఫికేషన్‌లో ట్రూఅప్ భారాన్ని నెలనెల వసూలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ సర్‌చార్జ్(ఎఫ్‌పీపీఏఎస్) పేరుతో దీనిని అమలు చేయాలని కేంద్రం పేర్కొంది. ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుతున్నట్లే ఇక కరెంట్ చార్జీలు నెలకొక్కసారి పెరుగుతుందన్న మాట. ప్రస్తుతం డిస్కంలు మూడు నెలలకోసారి చేసిన ఖర్చు ఆదాయంలో రాకపోతే ట్రూఅప్

...8లో



రెండు కోట్ల ఉద్యోగాల జాడెక్కడ?

భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

కోట రమేష్

వివరాలు 8లో

కేటీఆర్‌కు అరుదైన గౌరవం

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో చోటు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మంత్రి కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచంలోనే టాప్ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. వరల్డ్ టాప్ 30 ఇన్‌ఫ్లూయన్సర్స్ జాబితాలో మన దేశం నుంచి ఇద్దరు యువనేతలకు మాత్రమే చోటు దక్కడం విశేషం. అందులో ఒకరు మంత్రి కేటీఆర్ కాగా, మరొకరు ఎంపీ రాఘవ్ చద్దా. అయితే ఈ జాబితాలో ఎంపీ కంటే మంత్రి కేటీఆరే ముందు వరుసలో నిలబడటం గమనార్హం. అటు అఫిషియల్, ఇటు పర్సనల్



అకౌంట్... రెండింటిలోనూ మంత్రి కేటీఆర్ అగ్రస్థానంలో నిలిచారు. ఈ జాబితాలో మంత్రి కేటీఆర్ 12వ స్థానాన్ని దక్కించుకున్నారు. రాఘవ్ చద్దా 23వ స్థానంలో నిలిచారు. కాగా,

...8లో

సంపాదకీయం


'నేర' నేతలు

"నేరాల కోసం రాజకీయాలు." "రాజకీయాల కోసం నేరాలు.." అన్నట్టుగా మారిపోయాయి దేశ రాజకీయాలు. హత్యాయత్నం కేసులో పదేండ్లు శిక్ష పడటంతో లక్షద్వీప్ ఎంపీ మహ్మద్‌ఫైజల్‌పై తాజాగా అనర్హత వేటుపడింది. ఎన్సీపీకి చెందిన సదరు ఎంపీపై 2009లో కేసు నమోదైతే, పుష్కరకాలం తరువాత శిక్ష పడింది. ముజఫర్‌నగర్ అల్లర్ల కేసులో యూపీ

> నిరుడు సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ తమ పార్లమెంటులో 'చట్టసభల పవిత్రత - ప్రజాస్వామ్య వ్యవస్థ' అనే అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆ సందర్భంలో ఆయన భారత ఎంపీల నేరచరితల గురించి ప్రస్తావించారు. దానిపై మన నేతాశ్రీలు ఆనాడే భుజాలు తడుముకొన్నారు. ప్రభుత్వ వర్గాలైతే 'లీ' వ్యాఖ్యలపై అధికారికంగానే అభ్యంతరాలు వెలిబుచ్చాయి. ఎవరు అవునన్నా కాదన్నా నేర రాజకీయాల కబంధ హస్తాల్లో భారత ప్రజాస్వామ్యం విలవిల్లాడు తోందన్నది వాస్తవం.

బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సింగ్ సైనీ శాసనసభ్యత్వం కూడా ఇటీవలే రద్దయ్యింది. విద్వేష వ్యాఖ్యలు చేసినందుకు గాను అదే రాష్ట్రానికి చెందిన ఎస్పీ ఎమ్మెల్యే ఆజంఖాన్, మరో ఇద్దరు బీహార్ ఆర్జేడీ శాసనసభ్యులు కొద్ది నెలల క్రితమే బహిష్కృతులయ్యారు. ఆరేండ్ల కిందటి కేసులో ఝార్ఖండ్ కాంగ్రెస్ నేత మమతాదేవి గత నెలలోనే తన ఎమ్మెల్యే గిరీని వదులుకోవాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా నాయకులుగా చలామణీ అవుతున్న ఇలాంటి నేరగాళ్ళు ఇంకెందరో..!

ప్రస్తుత లోక్‌సభలో46శాతం మందిపై క్రిమినల్ కేసులుంటే, కేంద్రమంత్రుల్లో 42శాతం మంది నేరగాళ్లే అని ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం స్పష్టం చేసింది. ఇందులో 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు అన్ని పార్టీల వారున్నా సింహభాగం మాత్రం పాలక బీజేపీదే. హత్య, హత్యాయత్నం, లైంగికదాడులు, అపహరణలు, బలవంతపు వసూళ్ళు, దోపిడీ తదితర తీవ్ర కేసులు ఉన్నవారు కోకొల్లలు. నేరమయ రాజకీయాలే పరమావధిగా మారిన చోట ఆ పార్టీల నుంచి నేరరహిత నేతలను ఆశించడం అత్యాశే అవుతుంది. పైపెచ్చు ఆ చరిత్ర తమకే కాదు ప్రజలకూ ఉండాలని భావిస్తున్నారు! లేదంటే అధికార పార్టీ ఎంపీనే స్వయంగా కత్తులతో దాడులు చేయండని ప్రజలకు పిలుపు నివ్వడమేమిటీ?



నిరుడు సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ తమ పార్లమెంటులో 'చట్టసభల పవిత్రత - ప్రజాస్వామ్య వ్యవస్థ' అనే అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆ సందర్భంలో ఆయన భారత ఎంపీల నేరచరితల గురించి ప్రస్తావించారు. దానిపై మన నేతాశ్రీలు ఆనాడే భుజాలు తడుముకొన్నారు. ప్రభుత్వ వర్గాలైతే 'లీ' వ్యాఖ్యలపై అధికారికంగానే అభ్యంతరాలు వెలిబుచ్చాయి. ఎవరు అవునన్నా కాదన్నా నేర రాజకీయాల కబంధ హస్తాల్లో భారత ప్రజాస్వామ్యం విలవిల్లాడు తోందన్నది వాస్తవం. ఇలాంటి నేపథ్యంలో నేరస్తులు చట్టసభలలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడంలో చేతులెత్తేసిన ఈసీ చివరికి సుప్రీంకోర్టు తలుపు తట్టింది. దీనిపై 2018 సెప్టెంబర్‌లోనే బలమైన చట్టం చేయాలని పార్లమెంటును న్యాయస్థానం ఆదేశించింది. అయినా కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూనేవుంది. నేరాలు రుజువు కాకుండా ఒక వ్యక్తిని చట్టసభలలోకి రానీయకుండా తాము ఆపలేమని దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది పార్లమెంటే'నని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో నిర్ణయాధికారం పార్లమెంటు చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇంకేముంది మినుకుమినుకుమనే ఆశ కూడా అడుగంటి పోయే పరిస్థితి దాపురించింది. అధికారానికి నేరాన్ని ఒక మెట్టుగా భావించే బూర్జువా పార్టీలు నేర, అవినీతి రహితులను ఎందుకు ఎంచుకుంటాయి? తమ ప్రత్యర్థి పార్టీలకి మించిన నేరగాళ్లను బరిలోకి దింపాలనుకుంటాయి తప్ప సచ్ఛీలుర్ని అక్కున చేర్చుకుంటాయనుకుంటే పొరపాటే అవుతుంది. ఒకరికొకరు కూడబలుక్కున్నట్టు, ఒకరితో ఒకరు కుమ్మక్కు అయినట్టు బూర్జువా పార్టీలన్నీ కలిసి నేరరహితుల్ని ఎన్నికల బరిలోకే రాకుండా నియంత్రించేందుకు యత్నిస్తున్నాయి. ఈ స్థితిలో బూర్జువా పార్టీల నుంచి మనం రాజకీయాల్లో నేరప్రక్షాళన చట్టాలను ఊహించగలమా? తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేస్తూ ప్రజల తరపున పోరాడే వారిపై, ముఖ్యంగా కమ్యూనిస్టులపై పాలకులు అత్యంత తీవ్రమైన నిర్బంధాలకు పాల్పడుతున్న వైనాన్ని మనం చూస్తూనే ఉన్నాం. కాబట్టి, నేరచరితుల విషయంలో సుప్రీంకోర్టే గట్టి చట్టాన్ని తీసుకురావాలని ఆశించడం తప్ప పార్లమెంటుపై ఆశలు పెట్టుకునే అవకాశం ఆవగింజంతయినా లేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం చేతులెత్తేస్తే భారత ప్రజాస్వామ్యానికి దిక్కెవరు? ప్రజాస్వామ్యాన్ని నేతస్వామ్యంగా మార్చి మేడిపండు చందంగా చేస్తున్న భ్రష్ట రాజకీయాలకు చరమగీతం పాడాలి. చట్టాలు చేసే వారే చట్టానికి అతీతులుగా మారితే, వారిని దారికి తెచ్చే శక్తి ఒక్క ప్రజలకు మాత్రమే ఉంది. కనుక ప్రజలే ఆ దిశగా ఆలోచించాలి.

చైనాను బూచిగా చూపిస్తున్న అమెరికా మిలిటరీ ఉన్మాదం!



ఎం.కోటేశ్వరరావు

2023లో 858 బిలియన్ డాలర్ల మేరకు మిలిటరీ ఖర్చు చేయాలని పెంటగన్ (అమెరికా రక్షణశాఖ) నిర్ణయించింది. ఇది అడిగినదానికంటే 45 బి.డాలర్లు అదనం. నిజానికి 1200బి.డాలర్లు ఖర్చు పెట్టాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. రాజు తలచుకోవాలే గానీ దెబ్బలకు కొదవా అన్నట్టుగా మిలిటరీ పరిశ్రమల కార్పొరేట్లు కనుసైగ చేయాలేగానీ అమెరికా పాలకులు డాలర్లతో వాలిపోతారు. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపిఆర్ఐ-సిప్రీ) గతేడాది వెల్లడించిన సమాచారం ప్రకారం 2021లో తొలిసారిగా ప్రపంచ రక్షణ ఖర్చు రెండు లక్షల కోట్ల డాలర్లు (2,113 బి.డాలర్లు) దాటింది. అమెరికా, చైనా, భారత్, బ్రిటన్, రష్యా వాటా మొత్తంలో 62శాతం ఉంది. కరోనాను ఎదుర్కొనేం దుకు లేదా బాధితులను ఆదుకొనేందుకు చేసిన ఖర్చు సంగతేమో గానీ వరుసగా ఏడేండ్లు, కరోనాలో ఆర్థిక రంగం దిగజారినప్పటికీ వరుసగా రెండవ సంవత్సరం మిలిటరీ ఖర్చు మాత్రం పెరిగింది.

అమెరికాలో 2021లో 801 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టారు. సాంకేతికంగా ఇతర దేశాల కంటే పైచేయిగా ఉండాలన్న వైఖరితో ఏటా భారీ ఎత్తున పరిశోధన - అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. రష్యా నుంచి ప్రధానంగా ఎగుమతి జరిగే చమురు ధరలు తక్కువగా ఉండి రాబడి తగ్గటంతో 2016 నుంచి 2019 వరకు దాని మిలిటరీ ఖర్చు తగ్గింది. అయితే, అమెరికా, ఇతర నాటో దేశాల కుట్రలను పసిగట్టిన తరువాత ఉక్రెయిన్ సరిహద్దులో మిలిటరీని పెంచటంతో ఖర్చు కూడా పెరిగింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే 2021లో ఖర్చు పెరిగినందున 65.9బి.డాలర్లకు చేరింది. గతేడాది 75, ఈ ఏడాది 84బి.డాలర్లకు పెరగవచ్చని అంచనా. రెండవ స్థానంలో ఉన్న చైనా ఖర్చు 293 బి.డాలర్లుంది. గత 27 సంవత్సరాలుగా వరుసగా పెరుగుతూనే ఉంది.76.6 బి.డాలర్లతో మన దేశం

> అమెరికాతో సహా చైనాను దెబ్బతీసేందుకు చూస్తున్న దేశాలు దాన్ని ఒక బూచిగా చూపుతూ తమ ఖర్చును పెంచుతున్నాయి. ఏ దేశమూ మరో దేశాన్ని నమ్మే పరిస్థితి లేనందున మిలిటరీ నవీకరణకు తప్పనిసరిగా కొంత ఖర్చు పెరగటం సహజం. అమెరికా, ఐరోపాలోని ప్రయివేటు రంగంలోని ఆయుధ కంపెనీల లాభాలను పెంచేందుకు వివిధ ప్రాంతాలలో చిచ్చు రేపుతున్నందున, చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అనేక దేశాలు ఖర్చును పెంచాల్సి వస్తోంది.


మిలిటరీ ఖర్చులో మూడవ స్థానంలో ఉంది. ఇటీవల జపాన్ భారీ మొత్తాలను పెంచటంతో మనలను వెనక్కు నెట్టి మూడవ స్థానాన్ని ఆక్రమించనున్నట్లు వార్తలు. 2021లో 50 బి.డాలర్లకు మించిన ఖర్చు ఉన్న దేశాలు వరుసగా అమెరికా (801), చైనా (293), భారత్ (76.6), బ్రిటన్ (68.4), రష్యా (65.9), ఫ్రాన్స్ (56.6), జర్మనీ (56), సౌదీ అరేబియా (55.6), జపాన్(54.1), దక్షిణ కొరియా (50.2) ఉన్నాయి.

అమెరికాతో సహా చైనాను దెబ్బతీసేందుకు చూస్తున్న దేశాలు దాన్ని ఒక బూచిగా చూపుతూ తమ ఖర్చును పెంచుతున్నాయి. ఏ దేశమూ మరో దేశాన్ని నమ్మే పరిస్థితి లేనందున మిలిటరీ నవీకరణకు తప్పనిసరిగా కొంత ఖర్చు పెరగటం సహజం. అమెరికా, ఐరోపాలోని ప్రయివేటు రంగంలోని ఆయుధ కంపెనీల లాభాలను పెంచేందుకు వివిధ ప్రాంతాలలో చిచ్చు రేపుతున్నందున, చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అనేక దేశాలు ఖర్చును పెంచాల్సి వస్తోంది. ప్రపంచాన్ని భయ పెట్టేందుకు, తన పెత్తనాన్ని రుద్దేందుకు అవసరం లేకున్నా తొలిసారిగా అణుబాంబులను ప్రయోగించిన అమెరికా తరువాత కాలంలో ప్రపంచ మంతటా అణ్వాయుధాల తయారీ, ఇతర వాటికి పదును పెట్టే, సేకరణ పోటీకి తెరతీసింది. సోవియట్ యూనియన్‌ను బూచిగా చూపి రక్షణ పేరుతో నాటో కూటమిని ఏర్పాటు చేసి ఐరోపా ఖండాన్నే ఏకంగా తన గుప్పెట్లో పెట్టుకుంది. తన మిలిటరీ శక్తితో చైనా, ఇండో-చైనా దేశాలను ఆక్రమించుకున్నది జపాన్. అది రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిన తరువాత దాని మీదకు ఎవరో దాడికి రానున్నట్లు బూచిగా చూపి రక్షణ ఒప్పందం పేరుతో తన గుప్పిటలోకి తీసుకున్నదీ అమెరికానే. ఇప్పుడు చైనాను బూచిగా చూపి ఇతర దేశాలను తన ఉపగ్రహాలుగా మార్చుకొనేందుకు పూనుకుంది. దానిలో భాగంగానే కొత్త కథలు అల్లుతోంది.

చైనా దగ్గర ఇప్పుడున్న నాలుగు వందల అణ్వా యుధాలు 2035 నాటికి 1,500కు పెరుగుతాయని, అందువలన దాన్ని ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పెంటగన్ అందరినీ ఉసిగొల్పుతోంది. అంతే కాదు, అమెరికాలోని ఆయుధ పరిశ్రమల కోసం కూడా మీడియాలో కట్టుకథలను అల్లించటం, వాటిని చూపి బడ్జెట్‌ను పెంచాలని వత్తిడి తేవటం అమెరికాలో అనేక మంది అధికారుల, ఎంపీల రోజువారీ వృత్తి. ప్రస్తుతం ప్రపంచంలో అన్ని దేశాల దగ్గర 13,080 అణ్వాయుధాలు ఉన్నట్లు ఒక అంచనా. ఇక అణువిద్యుత్ కేంద్రం ఉన్న ప్రతి దేశం వాటిని ఏ క్షణంలోనైనా రూపొందించగల సత్తా కలిగినదిగా పరిగణిస్తున్నారు. రష్యా వద్ద 6,257 అణ్వస్త్రాలు ఉంటే వాటిలో తక్షణమే దాడికి పనికి వచ్చేవి 1,458, అందుబాటులో ఉన్నవి 3,039, పనికి రానివి 1,760గా చెబుతున్నారు. ఆ తరువాత అమెరికా వద్ద ఇలాంటివే వరుసగా 5,550-1,389-2,361-1,800 ఉన్నట్లు అంచనా. వీటితో పోలిస్తే చైనా ఒక మరుగుజ్జు మాదిరి ఉంటుంది. ఇక దేశాల వారీగా చైనా వద్ద 350, ఫ్రాన్స్ 290, బ్రిటన్ 225, పాకిస్థాన్ 165, భారత్ 156, ఇజ్రాయెల్ 90, ఉత్తర కొరియా వద్ద 40 నుంచి 50 వరకు ఉన్నట్లు అంచనా. ఈ అంచనాలు, సంఖ్యలను ఎవరూ పూర్తిగా నిర్ధారించలేరు. అవసరమైతే ఎప్పటికప్పుడు రూపొందించే ఆధునిక పరిజ్ఞానం అమెరికా, రష్యా వద్ద ఉంది. మరి ఇప్పుడు చైనాను చూపి మరింతగా మిలిటరీ ఖర్చు ఎందుకు చూపుతున్నట్లు అన్నది ప్రశ్న.

ఏడాదికి ఒక సారో రెండుసార్లో ఎవరైనా కొనుగోలు చేసి కాల్చగల దీపావళి బాంబుల వంటివి కాదు అణ్వాయుధాలు. వాటి రూపకల్పనకు ఖర్చైన మాదిరే నిర్వీర్యం చేసేందుకు కూడా చేతి సొమ్ము వదిలించుకోవాల్సిందే. అమెరికా తప్ప ఇంతవరకు ఏ దేశమూ వాటిని ప్రయోగించలేదు. అలాంటి పని చేస్తే ఏ దేశమూ మిగలదు. భారత్‌కు పాకిస్థాన్ ఎంత దూరమో పాకిస్థాన్‌కూ భారత్ అంతే దూరం. అదే విధంగా ఇతర అణుశక్తి దేశాలూ కూడా. ఎవరు అస్త్రాన్ని వదిలినా వెంటనే మరొకరు సంధిస్తారు. కట్టుకథలు, పిట్టకతలను ఆకర్షణీయంగా మలచటం తప్ప వాటిలో హేతుబద్ధత కనిపించదు. ఉదాహరణకు గతేడాది నవంబరు 29న సిఎన్ఎన్ ఒక వార్తను అల్లింది. దాని ప్రకారం చైనా వద్ద 2020లో రెండువందల అణ్వాయుధాలుండగా 2022 నాటికి 400కు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ వేగానికి అనుగుణంగా 2035 నాటికి 1,500కు పెరగవచ్చని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు రెట్టింపు పెరిగితే పదమూడు సంవత్సరాల్లో 12,800కు చేరతాయి. అది జరిగేదేనా? ఈ లోగా ఇతర దేశాలు చేతులు ముడుచుకు కూర్చుంటాయా? ఇలాంటి అంకెలకు ఆధారం ఏమిటి?

అణ్వాయుధాల కోసం అవసరమైన యురేనియం, ప్లుటోనియం కోసం అణురియాక్టర్లు, శుద్ధి కేంద్రాల నిర్మాణం జరగాలి. దానికోసం ఎంతో ఖర్చు అవుతుంది. అనేక దేశాలు విద్యుత్ వంటి పౌర అవసరాల కోసం అణుకేంద్రాల నిర్మాణం చేస్తున్నాయి. అక్కడే అణ్వాయుధాల రూపకల్పనకు అవసరమైన గ్రేడ్ల యురేనియం, ప్లుటోనియం కూడా తయారు చేయవచ్చు. విద్యుత్ కోసం చైనాతో సహా అనేక దేశాలు అణుకేంద్రాల నిర్మాణం చేపట్టాయి. మన దేశంలో 22 రియాక్టర్లు, ఎనిమిది విద్యుత్ కేంద్రాలున్నాయి. మరో పది రియాక్టర్లు, విద్యుత్ కేంద్రాలు నిర్మాణం, ప్రతిపాదనల్లో ఉన్నాయి. పెంటగన్ నివేదికల్లో చెప్పినవన్నీ ప్రమాణాలు కాదు. ఊహాగానాలు, ఆధారంలేని ఆరోపణలే అనేకం



ఉంటాయి. మూడు వందల ఖండాంతర క్షిపణుల (ఐసిబిఎం)ను ప్రయోగించేందుకు అవసరమైన నిర్మాణాలను చైనా జరుపుతోందన్నది దానిలో ఒకటి. దీనికి ఎలాంటి ఆధారం లేదని అమెరికా పత్రికలే రాశాయి. అమెరికా 1960 దశకం నుంచి ఐసిబిఎం, అణుక్షిపణి జలాంతర్గాములు, దీర్ఘశ్రేణి బాంబర్లను సమన్వయం చేసే విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నది. బరాక్ ఒబామా పాలనా కాలంలో వీటిని మరింత నవీకరించేందుకు 1.8లక్షల కోట్ల డాలర్లతో ఒక పథకాన్ని ప్రారంభించారు. చైనా కూడా ఇలాంటి వ్యవస్థలను రూపొందిస్తున్నదనే అనుమానం పెంటగన్‌కు ఉండి, చీకట్లో బాణాలు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఏ దేశానికైనా తన జాగ్రత్తలో తానుండే హక్కు, అవకాశం ఉంది.

అణుక్షిపణుల జలాంతర్గాములతో 1959 నుంచే అమెరికా పహారా కాస్తున్నది. చైనా వద్ద ఉన్న అలాంటి జలాంతర్గాములు 2021 నుంచి పని చేస్తున్నట్లు అంచనా. అమెరికా వద్ద 11,840 కిమీ దూరంలోని లక్ష్యాన్ని చేరుకొనే జలాంతర్గాములు క్షిపణులు ఉండగా చైనా వద్ద 6,880 కిమీ

> ఆయుధ నిధి కోసం తాము 106బి.డాలర్లు ఖర్చు చేస్తామని గతేడాది ఫిబ్రవరి 27న ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైన మూడు రోజుల తరువాత జర్మన్ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్ ప్రకటించాడు. జర్మనీ ఆయుధ కొనుగోళ్లపై ఉన్న ఆంక్షలను తప్పించుకోవటంతో పాటు, అమెరికాను సంతృప్తీకరించటం నాటోలో అమెరికా తరువాత పెత్తనం తనదే అని ప్రదర్శించుకొనే ఎత్తుగడ కూడా ఇందులో ఉంది. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్నా ఆర్థికంగా దిగజారి ఉన్నందున బ్రిటన్ ఖర్చు పెంచే స్థితిలో లేదు. జపాన్ మాదిరే ఇటీవలి కాలంలో జర్మనీ తన ఆధిపత్యాన్ని పెంచుకొనేందుకు చూస్తున్నది. తటస్థ దేశాలుగా ఉన్న స్వీడన్, ఫిన్లండ్ కూడా నాటోలో చేరి మిలిటరీ ఖర్చును పెంచనున్నాయి. పోలాండ్ కూడా ఖర్చు పెంచేందుకు పూనుకుంది. ఇవన్నీ జరిగితే సింహభాగం అమెరికా సంస్థలే లబ్ధి పొందుతాయి.

దూరం వెళ్లే క్షిపణులున్నట్లు ఊహిస్తున్నారు తప్ప ఆధారాలు లేవు. ఒక్కటి మాత్రం వాస్తవం చైనా అంటే చౌక ధరలకు అందించే పాదరక్షలు, దుస్తులు, ఫోన్లు, టీవీల వంటి వినియోగవస్తువులను మాత్రమే భారీ ఎత్తున తయారు చేయగలదని అనేక మంది ఇప్పటికీ ఒక భ్రమలో ఉన్నారు. బొమ్మ విమానాలు, దీపావళి తారాజువ్వ లనే కాదు నిజమైన వాటిని రూపొందించగల సత్తా సమకూర్చుకుంది. చైనాలో గుట్టు ఎక్కువ. రోజువారీ వస్తువులతో పాటు తనను దెబ్బతీసేందుకు చూసే వారికి దడపుట్టించే ఆధునిక అస్త్రాలను కూడా అది ఇప్పుడు కలిగి ఉంది. అమెరికాకు పట్టుకున్న భయాలలో అదొకటి. ఇటీవల తైవాన్ జలసంధిలో అలాంటి వాటిని చైనా ప్రదర్శించింది.

2023లో జర్మనీతో సహా నాటో దేశాలన్నీ రక్షణ ఖర్చును భారీ ఎత్తున పెంచనున్నాయి. వాటి జీడీపీలో రెండు శాతం అందుకు కేటాయించాలని, నాటో ఖర్చును తామెంత కాలం భరించాలంటూ, ఒక వేళ రష్యా గనుక దాడి చేస్తే రక్షణకు తాము వచ్చేది లేదంటూ డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నపుడు బహిరంగంగానే వత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభ నేపథ్యంలో భారీగా పెంచుతున్నప్పటికీ పెంటగన్ వాటిని లోకకల్యాణం కోసం అన్నట్లుగా చూస్తున్నది. జీడీపీలో రెండు శాతం అన్న దానికి అనుగుణంగా ప్రత్యేక ఆయుధ నిధి కోసం తాము 106బి.డాలర్లు ఖర్చు చేస్తామని గతేడాది ఫిబ్రవరి 27న ఉక్రెయిన్ సంక్షోభం ప్రారంభమైన మూడు రోజుల తరువాత జర్మన్ ఛాన్సలర్ ఓల్ఫ్ షుల్జ్ ప్రకటించాడు. జర్మనీ ఆయుధ కొనుగోళ్లపై ఉన్న ఆంక్షలను తప్పించుకోవటంతో పాటు, అమెరికాను సంతృప్తీకరించటం నాటోలో అమెరికా తరువాత పెత్తనం తనదే అని ప్రదర్శించుకొనే ఎత్తుగడ కూడా ఇందులో ఉంది. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్నా ఆర్థికంగా దిగజారి ఉన్నందున బ్రిటన్ ఖర్చు పెంచే స్థితిలో లేదు. జపాన్ మాదిరే ఇటీవలి కాలంలో జర్మనీ తన ఆధిపత్యాన్ని పెంచుకొనేందుకు చూస్తున్నది. తటస్థ దేశాలుగా ఉన్న స్వీడన్, ఫిన్లండ్ కూడా నాటోలో చేరి మిలిటరీ ఖర్చును పెంచనున్నాయి. పోలాండ్ కూడా ఖర్చు పెంచేందుకు పూనుకుంది. ఇవన్నీ జరిగితే సింహభాగం అమెరికా సంస్థలే లబ్ధి పొందుతాయి.

సెల్:8331013288

మెయిల్ @ నవతెలంగాణ

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే..!

మన దైనందిన జీవితంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు ఇప్పుడు మామూలయ్యాయి. టికెట్లు, వస్తువుల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులకు ఆన్‌లైన్ మార్గమే శరణ్యమనేంతగా ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్లు మాటువేసి అమాయకులను లూటీ చేయడం పెరిగింది. ఏదో ఒకరకంగా మభ్యపెట్టి నగదు దోచేస్తారు. విద్యావంతులు కూడా వీరి వలలో పడుతున్నారు. అలా పోయిన డబ్బు పోలీసులకు, బ్యాంకులకు, ఫిర్యాదు చేస్తే 100శాతం తిరిగి వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. అందుకే సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్త పడడమే ఉత్తమమైన మార్గం.

భారతదేశంలో సైబర్ నేరాలు ఏ విధంగా విజృంభిస్తున్నాయో అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) గణాంకాల ప్రకారం 2011లో ఐటి అక్ట్ కింద 1791 సైబర్ నేర కేసులు నమోదైతే, 2012లో 2876 కేసులు నమోదయ్యాయి. ఒక్క ఏడాదిలోనే 60శాతం పెరుగుదల నమోదైంది. 2008లో దేశవ్యాప్తంగా 288 సైబర్ నేరాలు నమోదైతే, 2009లో 420, 2010లో 966, 2011లో 1791, 2012లో 2876 కేసులు నమోదయ్యాయి. అంటే సైబర్ నేరాల తీవ్రత ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందని స్పష్టమవుతోంది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ సెక్షన్) ప్రకారం 2011లో 422 సైబర్ నేరాలు నమోదైతే, 2012లో 601 సైబర్ నేర కేసులు నమోదయ్యాయి. అంటే ఒక్క ఏడాది వ్యవధిలో 42.4శాతంత పెరుగుదల నమోదయిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. డబ్బు వ్యవహారాలు ఆన్‌లైన్ అయ్యేకొద్దీ, ఆర్థిక నేరాలు తీవ్రమవుతున్నాయి. సైబర్ మోసగాళ్ల వల్ల డబ్బు కోల్పోయిన 75శాతం మంది బాధితులకు ఆ సొమ్ము తిరిగి రావడం లేదు. లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సైబర్ నేరాల బాధితులను మూడేండ్ల పాటు సర్వే చేయగా, వారిలో 74శాతం మందికి ఇప్పటికీ డబ్బు వాపస్ కాలేదని తెలిసింది. 33శాతం మంది తమ బ్యాంక్ అకౌంట్, డెబిట్ లేదా క్రెడిట్‌కార్డు పాస్‌వర్డ్స్, ఆధార్, పాన్‌కార్డు నంబర్లను కంప్యూటర్‌లో దాచుకున్నారు. 11శాతం మంది ఈ వివరాలు అన్నింటిని మొబైల్‌లో భద్రపరచుకున్నట్లు చెప్పారు. దీంతో సులభంగా వంచకులు, హ్యాకర్ల చేతికి అందడంతో వంచనకు గురవుతున్నారు.

సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో అన్ని విధాలుగా సైబర్ భద్రతకు సంబంధించి ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించడం కోసం ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తీసుకురావాల్సిన అవసరం ఉంది. దేశంలో వివిధ స్థాయిల్లో సైబర్ భద్రతతకు వాటిల్లే ముప్పును ఎదుర్కొనేందుకు వీలుగా యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని జాతీయ ఇంటర్నెట్ భద్రత విధానం సూచిస్తోంది. సైబర్ భద్రతకు సంబంధించిన అన్ని వ్యవహారాలను ఒక జాతీయ నోడల్ ఏజెన్సీతో కలిసి సమన్వయం చేసుకుంటూ ఈ యంత్రాంగాలు పనిచేయాల్సి ఉంటుంది.

"సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి, తస్మాత్ జాగ్రత్త" అని పోలీసులు సైతం ప్రజలను పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా కొందరు అమాయకులు వారి ఉచ్చులో పడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమిషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశచూపి, నిలువునా ముంచుతున్నారు. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండని, మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండని, మీ ఏటీఎం పనిచేయడం లేదని, మీరు కారు గెలుచుకున్నారని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తున్నారు.

ఈ ఆన్‌లైన్ మోసాలు సైబర్ నేరాలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కల్పించాలి. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి, వివరాలు తెలియజేస్తే 24గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు. అనవసర సమయాల్లో ఇంటర్నెట్ ఆఫ్ చేయడం మంచిది. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలి. బహుమతులు, లాటరీలు గెల్చుకున్నారంటూ వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దు. వర్క్ ఫ్రం హోం ఉద్యోగం కల్పిస్తామని చెప్పే వారితో జాగ్రత్తగా ఉండాలి. బయటి ప్రాంతాల్లో ఉచిత వైఫై ఉపయోగించకపోవడం మంచిది. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలు అప్‌లోడ్ చేయకపోవడం ఉత్తమం. గోప్యత పాటించాలి. అప్పుడే సైబర్ నేరాలు తగ్గి, ఎవరి చేతిలో మోసపోకుండా ఉంటాం.

- మోటె చిరంజీవి, సెల్: 9949194327

జాడలేని జాతీయ సేవాపథకం

డి.ఎస్. కొఠారి (1964-66) నేతృత్వంలోని విద్యా కమిషన్ అన్ని దశలలో విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. భారత ప్రభుత్వం విద్యపై జాతీయ విధానం ప్రకటనలో పని అనుభవం జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించింది. మే, 1969 సంవత్సరంలో విద్యా మంత్రిత్వశాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది.

కానీ గత నాలుగు సంవత్సరాలుగా జాతీయ సేవ పథకం కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మధ్య కాలంలో సేవ తక్కువ ప్రచారం ఎక్కువగా ఉంటున్నది. మానవ సంబంధాలు ఏమాత్రం లేని వారిని ఏరికోరి ప్రోగ్రాం ఆఫీసర్లుగా నియమిస్తున్నారు. ప్రతి విశ్వవిద్యాలయం పరిధిలో కనీసం లక్ష మంది విద్యార్థులు ఉంటున్నారు, మారుమూల ఉన్న ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో సైతం కనీసం రెండువేల మంది విద్యార్థులు ఉన్నప్పుడు సంవత్సరానికి నాలుగు రోజులు, రోజుకు నాలుగు పనిగంటలు అంటే సుమారు పదహారు వేల పనిగంటల సమయంతో ఎన్నో పనులు చేయవచ్చు. ఎన్నో శాశ్విత పథకాలకు రూపకల్పన చేయవచ్చు. గతంలో జాతీయ సేవ పథకానికి ఎంతో గుర్తింపు ఉండేది. గ్రామాలను దత్తత తీసుకునే వారు, గ్రామాభ్యుదయం, ప్రజల జీవన సరళి, వైవిధ్యత, జాతీయ సమైక్యత భావన విద్యార్థులలో ఉండేది. విశ్వవిద్యాలయాలలో యూత్ అండ్ కల్చరల్ ఫెస్టివల్స్ జరిగేవి. దేశంలో వివిధ ప్రాంతాల సంస్కృతి, ఆహార అలవాట్లు, ఆచారాలు, కట్టుబాట్లు తెలిసేవి. సమాజం అవసరాలు, సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారాలు యోచించడం జరిగేది. తమలో తాము సామాజిక, పౌర బాధ్యతల భావనను పెంపొందించుకోవడం. వ్యక్తిగత, కమ్యూనిటీ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడంలో వారి జ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని సమీకరించడంలో నైపుణ్యాలను పొందడం, నాయకత్వ లక్షణాలను, ప్రజాస్వామిక విలువలను పెంచుకోవడం, అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని అభ్యసించడం ప్రధాన లక్ష్యాలుగా పనిజరిగేది. ఇప్పుడవి మచ్చుకు కూడా కనిపించకపోవడం ఆందోళనకరం. విద్యార్థి దశలోనే అలాంటి ఉన్నత భావాలు పాదుకొల్పినప్పుడే ఉత్తమ పౌర సమాజాన్ని ఆశించవచ్చు. సేవా దృక్పథం లేని సమాజం వృధా!

- డాక్టర్ ముచ్చుకోట సురేష్‌బాబు

మాకూ "వెలుగులు" ప్రసాదించండి

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, ఆయా దేశాలలోని రాష్ట్రాలు అభివృద్ధిపథంలో ముందు వరుసలో ఉండాలంటే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించేది వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు. వైద్య ఆరోగ్య రంగం అనేది ఒక "సేవారంగం." ఈ రంగాన్ని మిగతా అన్ని ప్రభుత్వ శాఖల మాదిరిగా చూడకూడదు. ఈ శాఖ మీద పూర్తిగా ప్రభుత్వానికి అజమాయిషి ఉంటేనే ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో ఉంటుంది. ప్రజలందరికీ పూర్తి స్థాయిలో వైద్య ఆరోగ్య చికిత్సలు సంతృప్తికరంగా అందాలంటే ఈ రంగంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు మొదలుకొని ఇతర అన్ని కేడర్ల పారామెడికల్ ఉద్యోగులు, నాలుగో తరగతి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, డాక్టర్స్ ఇతర స్పెషలిస్టులు, అన్ని స్థాయిల్లో పనిచేస్తున్న అధికారులు, వైద్య ఆరోగ్య శాఖలోని మొత్తం ఉద్యోగులకు సంబంధించి అన్ని విధాల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి.



కె. యాద నాయక్

ఇంతటి కీలకమైన వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా నిరాదరణకు గురి అవ్వడం అత్యంత బాధాకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణలో భాగంగా వైద్య, ఆరోగ్యరంగంలో 2000 సంవత్సరం నుండి ప్రయివేటీకరణ విధానాలు అమలు చేసి, ఈ రంగాన్ని ప్రయోగశాలగా మార్చి, రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ, హైయిర్డ్, డైలీ వైజెస్ తదితర పేర్లతో సిబ్బందిని నియమించి, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్ ఇతర చట్టబద్ధ సౌకర్యాలు ఏవీ అమలు చేయకుండ, గత 23ఏండ్లుగా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఈ వెట్టి చాకిరీ విధానం రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ యథావిధిగా పర్మినెంట్ చేయాలని యూనియన్ల ఆధ్వర్యంలో ఉద్యోగులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

2000 సంవత్సరంలో పట్టణ ప్రాంతాలలోని మురికివాడలలో నివసిస్తున్న పేదలకు వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్‌సెంటర్లను ఏర్పాటు చేసి, ఇందులో కాంట్రాక్టు పద్ధతిలో డాక్టర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ ఆర్గనైజర్, పబ్లిక్ హెల్త్ మేనేజర్, మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్, స్వీపర్, వాచ్ మెన్ తదితరులను నియమించారు. 22ఏండ్ల సర్వీసు పూర్తి అయినా వీరిలో ఏ ఒక్కరూ పర్మినెంట్ కాకపోవడం అత్యంత దుర్మార్గం. వీరి సర్వీసులు సంతృప్తికరంగా అందుతున్నాయని భావించిన ప్రభుత్వం గ్రామీణ మారుమూల ఏజెన్సీ గూడాలు, పల్లెలు, గ్రామాలల్లో కూడా వైద్య ఆరోగ్యసేవలు మెరుగుపరచాలని 2005లో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో రెండవ ఏఎన్ఎంలను నియమించింది.

2002లో రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ సాక్షండ్ రెగ్యులర్ పోస్టులలో రెగ్యులర్ ప్రాతిపదికన సిబ్బందిని నియమించ తకుండా కాంట్రాక్టు పద్ధతిలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ మెరిట్ ప్రాతిపదికన 100శాతం గ్రాస్ శాలరీ ఇచ్చి ఉద్యోగులను భర్తీ చేసింది. ఇందులో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను యధావిధిగా రెగ్యులర్ చేసిన ప్రభుత్వం మీద ఏ మాత్రం భారం పడదు, అయినా ప్రభుత్వం రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేస్తున్నది.

వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ మేల్, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్, రెండవ ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్టులు, యూరోపియన్ ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, డ్రైవర్స్, సపోర్టింగ్ స్టాఫ్, స్వీపర్స్, సెక్యూరిటీ, సానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బంది, వాచ్ మెన్స్, 102, 104, 108, ఆరోగ్యశ్రీ, ఆయుష్, నేషనల్ హెల్త్ మిషన్‌లోని ఇతర అన్ని విభాగాలలోని అన్ని క్యాడర్ల సిబ్బంది, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ తదితర డైరెక్టరేట్‌లలోని అన్ని క్యాడర్ల సిబ్బంది అందరూ కూడా గత 23ఏండ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త కొత్త రోగాలను అరికట్టడం కోసం పనిచేస్తున్నారు.

ప్రధానంగా 2019 నుండి కోవిడ్‌తో సహవాసం చేస్తూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి కరోనా రోగులకు సేవలు అందించారు. ఒక రకంగా చెప్పాలంటే అయిన వారు ఎవరు కూడ దగ్గరికి రాని పరిస్థితుల్లో తమ



ప్రాణాలకు ప్రమాదం అని తెలిసి కూడా, కరోనా రోగులను అక్కున చేర్చుకుని అన్ని రకాల వైద్య ఆరోగ్య చికిత్సలు అందించి వారి ప్రాణాలను కాపాడారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజలకు అందించి, ప్రజల్లో ప్రభుత్వాలకు పేరు తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ఏక కాలంలో 36 రకాల పనులు అప్పగించినా సమర్థవంతంగా పూర్తి చేసి, సిబ్బంది తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన కేసీఆర్ మానస పుత్రిక, కేసీఆర్ కిట్ పథకాన్ని 100శాతం ప్రజలకు అందిస్తున్నారు. ఆదేవిధంగా 2018లో కంటి వెలుగు మొదటి విడతను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించి విజయవంతం చేశారు.

> తెలంగాణ ప్రభుత్వం నేటి నుండి రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో 18ఏండ్లు, ఆ పైన ఉన్న వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు, కంటి ఆపరేషన్లు ఇతర సౌకర్యాలు కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించడం అభినందనీయం. కానీ అదే సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తూ రెగ్యులరైజేషన్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ తమను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో కూడా "వెలుగులు" ప్రసాదించాలని కోరుకుంటున్నారని ప్రభుత్వం గుర్తించాలి.

తెలంగాణ ప్రభుత్వం నేటి నుండి రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో 18ఏండ్లు, ఆ పైన ఉన్న వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు, కంటి ఆపరేషన్లు ఇతర సౌకర్యాలు కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించడం అభినందనీయం. కానీ అదే సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తూ రెగ్యులరైజేషన్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగు లందరూ తమను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో కూడా "వెలుగులు" ప్రసాదించాలని కోరుకుంటున్నారని ప్రభుత్వం గుర్తించాలి.

సెల్ :9441011195



సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు సాయమ్మ మృతి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గాదెపాడులో సీపీఎం అభిమాని, సానుభూతిపరాలు యనమనగండ్ల సాయమ్మ(65) మంగళవారం మృతి చెందింది. సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు యనమగండ్ల రవి మాతృమూర్తి అయిన సాయమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సాయమ్మ మతదేహం పై సిపిఎం పతాకాన్ని కప్పి, పూలదండ వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, యనమనగండ్ల రవి, మాలోతు రామకోటి, భూక్య లక్ష్మణ్, మన్యం బ్రహ్మయ్య, ఎరిపోతు భద్రయ్య, నాగయ్య అజ్మీర శోభన్ బాబు, నాగారపు లక్ష్మణ్, నాగరాజు, కట్టెకోల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐఎంఎల్ డిపోను సందర్శించిన టిఎస్‌బిసిఎల్ ఛైర్మన్

నవతెలంగాణ-వైరా

వైరాలోని ఐఎంఎల్ డిపోను మంగళవారం టిఎస్‌బిసిఎల్ రాష్ట్ర చైర్మన్ గజ్జల నగేష్ సందర్శించారు. ఐఎంఎల్ డిపోలో గోదాముల్లో నిల్వ ఉన్న మద్యంను ఆయన పరిశీలించారు. మద్యం నిల్వల వివరాలను డిపో మేనేజర్ కాశీనాథ్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. వైరా డిపో గోదాముల్లో వివిధ రకాల లిక్కర్స్ను, తల్లాడలోని గోదాముల్లో వివిధ రకాల బీర్లను నిల్వ ఉంచుతున్నామని డిఎం వివరించారు. ప్రతినెల మద్యం విక్రయాల వివరాలను డిఎంను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఐఎంఎల్ డిపోలోని ఉద్యోగులు నిబంధనలకు అనుగుణంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఆయన హమాలీలతో మాట్లాడారు. ఈ డిపోలో మొత్తం ఎంతమంది హమాలీలు పనిచేస్తున్నారు... ఎగుమతి, దిగుమతికి హమాలీలకు ఎంత నగదు చెల్లిస్తున్నారని విషయాలను ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎల్ డిపో ఎక్సైజ్ సీఐ పవన్, ఏఎమ్ఓ చేకూరి నారాయణ, వైరా ఎక్సైజ్ ఎస్ఐ కిరీటి పాల్గొన్నారు.



13 వేల మంది తరలింపునకు ఏర్పాట్లు పూర్తి : ఎంపీపీ

నవతెలంగాణ- కల్లూరు

ఖమ్మంలో నిర్వహించే బిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు 13 వేలమంది తరలింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీపీ బీరవల్లి రఘు, టిఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు పాలెపు రామారావు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాల యంలో గ్రామ ఇన్చార్జిలకు జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 టాటా ఏసీలు, 50 స్కూల్ బస్సులు, 600 ఆటోలు, 50 డీసీఎంలు, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇన్చార్జిని ఏర్పాటు చేసి అన్ని బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, చండుపట్ల సర్పంచ్ గొల్లమందర ప్రసాద్, బొక్క వెంకటేశ్వర్లు, రాచమల్ల నాగేశ్వరరావు, కట్టా అరులప్ప తదితరులు పాల్గొన్నారు.



5,200 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు

విలేకరుల సమావేశంలో సీపీ

నవతెలంగాణ- ఖమ్మం

నూతనంగా ప్రారంభించనున్న సమీకృత కలెక్టర్ భవన సముదాయం, బిఆర్ఎస్ ఆవిర్భావ సభను పురస్కరించుకొని కమిషనరేట్ పరిధిలో 5200 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరిస్తున్నట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్‌వారియర్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ శబరీశ్‌తో కలిసి మాట్లాడారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. ప్రజలు అత్యవసర ప్రయాణాలనే పెట్టుకోవాలని సూచించారు. అనవసర ప్రయాణాలు చేసి ఇబ్బందులు పడొద్దన్నారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వచ్చే వాహనాలను కోదాడ మీదుగా విజయవాడ హైవేకు మళ్లించామని తెలిపారు. ఆవిర్భావ సభకు 5200 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దీన్ని స్కాన్ చేస్తే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో రూట్ తెలుపుతుందన్నారు. ప్రజలు పోలీసుల ఆంక్షలను అర్థం చేసుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిర్బంధాలపై ఎన్డీ నిరసన

నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మం వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ప్రజా సమస్యలు తీసుకవెళ్ళకుండా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకలుపై నిర్బంధాలను విధించటంపై కారేపల్లి మండలంలో నిరసన కార్యక్రమాలకు దిగింది. పేరుపల్లిలో నోటికి నల్లగుడ్డలను కట్టుకోని నిరసనను చేపట్టారు. ఈసందర్భంగా ఎన్డీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యల వినటానికి ఉద్యమనేతకు తీరిక లేకుండా పోయిందన్నారు. సమస్యలను సీఎం దృష్టికి తేవటానికి వీలు లేకుండా నిర్బాంధాలతో విధిస్తున్నారన్నారు. రాష్ట్రం నిర్బంధకాండ సాగుతుందని ఇది సహించరానిదని, నిర్బాంధాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు తప్పదన్నారు. ఈకార్యక్రమంలో ఎన్డీ నాయకులు కంచర్ల శ్రీనివాసరెడ్డి, వై.జానకీ, అలెం చంద్రయ్య, గురవయ్య, సుగుణ, కోటమ్మ, మంగమ్మ, సంపత్, నాగేశ్వరరావు, బైరుమళ్ల లక్ష్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన వారి శిక్షించాలి

నవతెలంగాణ-కారేపల్లి

ఖమ్మంలో న్యాయవాదదంపతులు క్రిష్టోపర్- అనురాధలపై దాడి చేసిన వారిన కఠినంగా శిక్షించాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం దళిత బహుజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కే.లక్ష్మికి వినతి అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు లిక్కి కృష్ణారావు, పొడగంటి రాంబాబు, ఇనపనూరి నాగలక్ష్మి, మైప వీరయ్య, సోమందుల రాములు, సోమందుల నాగరాజు, చెవుల చందు, బోగిళ్ల వెంకటేశ్వర్లు, మేదరి వీరప్రతాఫ్(టోనీ) తొగరు రమేష్, శ్రీను, సోమందుల వెంకటేశ్వర్లు, తలారి అనిల్, నందనూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేలవంగా కొనసాగిన సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ముదిగొండ



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన మంగళవారం సాదాసీదాగా నిర్వహించారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలు ఉండగా ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచులు పెద్దగా హాజరు కాలేదు. మండలంలో 23 ప్రభుత్వ శాఖలు ఉండగా, ఆశాఖల అధికారులు కూడా సమావేశానికి డుమ్మా కొట్టారు. గ్రామాల్లోనే పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సభ్యులు ప్రభుత్వ పాలనపై అసంతృప్తిగా ఉండటం వలనే సమావేశానికి హాజరు కాలేకపోయామని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. గ్రామపంచాయతీలకు సుమారు ఐదునెలల నుండి ప్రభుత్వం నుండి నిధులు జీపి ఖాతాలలో జమ కావడం లేదని పలువురు సర్పంచులు సమావేశానికి హాజరు కాలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, డిటిఎం డేవిడ్ కరుణాకర్, సిడిపిఓ సరస్వతి, ముదిగొండ గ్రామపంచాయతీ సర్పంచ్ మందరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతునేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-కూసుమంచి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు వ్యవసాయ పెట్టుబడులపై 50% అదనంగా కలిపి పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని రాష్ట్ర జాబితా నుండి ఉమ్మడి జాబితాలో తప్పనిసరిగా అమలు చేయాలని, బ్యాంకులు రైతులకు వడ్డీలేని రుణాలు అందించాలని, వ్యవసాయ యంత్రాలపై 75% సబ్సిడీలకు రైతులకు ఇవ్వాలని, రైతులకు ప్రాథమిక వనరులు అయినటువంటి భూమి, నీరు, ఎరువు, యంత్రాలు, విద్యుత్ లాంటి వాటికి రైతుకు ప్రభుత్వాలు భరోసా కల్పించాలని, రైతులు వ్యవసాయాన్ని తమ హక్కుగా భావించి దేశ కోసం పనిచేస్తున్న సమయంలో వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తులు జొరబడి, వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, ఇది కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలం అధ్యక్ష కార్యదర్శులు తొటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు వెన్ను ఉపేందర్, టీ.మాధవరావు, గ్రామ సర్పంచి పొట్ట పింజర నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ తాళ్ళూరి రవి, చీర్ల రాధాకృష్ణ, హైస్కూల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రైమరీ స్కూల్ చైర్మన్ మద్దిల రవి, చిన్న వెంకటేశ్వర్లు, ప్రతాప్, ప్రసాద్, సింహాద్రి, ఉపేందర్, శ్రీనివాసరావు, కాకర్ల వీరబాబు, సాగర్ రంగారావు, చిట్టి పోతుల వెంకన్న, చీరల వీరయ్య, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

యాదవ్, కురుమలకు నగదు బదిలీ చేయాలి

- జిఎంపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెర్వు, తుశాకుల

నవతెలంగాణ- ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం యాదవ్, కురుమల అకౌంట్‌లలోకి డైరెక్ట్‌గా నగదు బదిలీ చేయడం ద్వారా మాత్రమే అవినీతికి తావు లేకుండా కుటుంబాలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం మునుగోడులో ప్రకటించిన నగదు బదిలీ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, నగర కార్పొరేషన్లు, మున్సి పాలిటీలలో కూడా ఈ పథకాన్ని యాదవ్, కురుమలకు వర్తింపజేసి నగదు బదిలీ చేయాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జియంపియస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెర్వు కోటేశ్వరరావు, తుశాకుల లింగయ్యలు డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం ఖమ్మం జిల్లాలో 326 సొసైటీలలో 31,773 మంది సభ్యులు ఎంపిక చేయగా ఈ ఐదేండ్ల లో కేవలం 15,710 మంది సభ్యులకు మాత్రమే గొర్రెలు గ్రౌండింగ్ చేశారని, జిల్లాలో 16,160 మంది యాదవ్, కురుమలకు గ్రౌండింగ్ చేయాల్సి ఉందని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3,39,980 మంది సొసైటీల సభ్యులకు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. గత గొర్రెల పంపిణీలో దళారులు, కొంత మంది పశు వైద్య అధికారులు బాగు పడ్డారు తప్ప యాదవ్, కురుమలకు లాభం జరగలేదన్నారు. 2022 జూన్‌లో లబ్దిదారుల వాటా రూ.43,750 కట్టుకోవాలని అధికారులు చెప్పగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 8,332 మంది సభ్యులు 36కోట్లు 45 లక్షల 25వేల రూపాయలు చెల్లించి ఏడు నెలలు అవుతుందని, చాలా మంది యాదవ్, కురుమలు జూన్ లో వ్యవసాయ పెట్టుబడుల సీజన్ అయినా వడ్డీలకు, కొంతమంది ఫైనాన్స్ వడ్డీలకు తెచ్చి డబ్బులు కలెక్టర్ అకౌంట్‌కి పంపించారన్నారు. రోజు రోజుకూ వడ్డీలు పెరిగిపోతున్నాయి తప్ప నేటికీ ఈ పథకం గ్రౌండింగ్ పై స్పష్టత లేదని విమర్శించారు. అధికారులు కూడా నిర్దిష్టత ఇవ్వలేకపోతున్నారని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా నగదు బదిలీ చేయడంతో యాదవ్, కురుమల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారన్నారు. కానీ ఎన్నికల అనంతరం ట్రాన్స్‌ఫర్ చేసిన ఎమౌంట్‌ను తిరిగి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో ప్రభుత్వం కేవలం యాదవ్, కురుమల ఓట్ల కోసమే నగదు బదిలీ చేసి ఎన్నికల్లో గెలిచి అవసరం తీరగానే అమౌంట్ వెనక్కి తీసుకొని మోసం చేసిందని విమర్శించారు. ఒక్క మునుగోడుతోనే యాదవ్, కురుమల అవసరం తీరిందని భావిస్తే భవిష్యత్తులో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే ఈ సభలోనే ముఖ్యమంత్రి నగదు బదిలీ ప్రకటన చేసి అమౌంట్ ట్రాన్స్ ఫర్ చేయాలని, కార్పోరేషన్‌లు, మున్సిపాలిటీలలో యాదవ్, కురుమలకు కూడా ఈ పథకం వర్తించేయాలని, లబ్ధిదారుల వాటా లేకుండా డైరెక్ట్‌గా గొల్ల, కురుమల కుటుంబాలకు కనీసం రూ. 5 లక్షల వరకు ఎకౌంట్ లలోకి నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో ప్రభుత్వం యాదవ్, కురుమల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు.

బీఆర్ఎస్ సభకు వేలాదిగా తరలిరావాలి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ఖమ్మంలో బుధవారం జరగనున్న టిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని టిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు భాష బోయిన వీరన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మండలంలో అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.



సీపీఐ(ఎం) నాయకుని మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

బీరోలు గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) గ్రామ నాయకులు గుమ్మడి రాజయ్య(54) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సందర్శించి నివాళ్లర్పించారు. నివాళ్లర్పించిన వారిలో నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య, పప్పుల ప్రసాద్, కొత్తపల్లి దామోదర్ రెడ్డి, కోడి లింగయ్య, నాగాడ్ సురేష్, గోపోజు రవిలు ఉన్నారు.



నోటీసులు వెనక్కి తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-ముదిగొండ

రోడ్డు వెడల్పు పేరుతో వల్లభి వెళ్లే ప్రధాన రహదారి ఆనుకొని అన్న నివాస గృహాలు అక్రమ నిర్మాణాలంటూ వాటిని తొలగించాలని ఆర్అండ్‌బి శాఖ అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శిచే నోటీసులు ఇప్పించారని, ఆ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ఎంపీడీవో డి శ్రీనివాసరావులకు మండల పరిషత్ కార్యాలయంలో నివాసగృహాల బాధితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు వెడల్పు రెండు వైపులా చేయాలని ఒకవైపే నోటీసులు ఇచ్చారని, ఇది సమంజసం కాదని బాధితులు వాపోయారు. నివాసగృహాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రహదారి అభివృద్ధి చేయాలని గృహాల బాధితులు ఎంపీపీ, ఎంపీడీవోలకు వివరించారు.

నేడు చిరునోములలో ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభం

నవతెలంగాణ - బోనకల్

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మధిర నియోజకవర్గం ఇంచార్జ్ వాసిరెడ్డి రామనాథం బుధవారం ప్రారంభిస్తారని టిడిపి మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా రాయన్నపేట గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టకు వాసిరెడ్డి. రామనాథం భూమి పూజ చేయనున్నారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఏదులాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన గుండెపుడి శేఖర్(29) తన ద్విచక్రవాహనంపై వరంగల్ క్రాస్ రోడ్డు వైపు నుంచి ఏదులాపురం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలో ఏదులాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నవతెలంగాణ- నేలకొండపల్లి

మండలంలోని బోదులబండ ప్రభుత్వ పాఠశాలలో 1989 నుండి 1994 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక మంగళవారం ఆద్యంతం ఆనందంగా సాగింది. చిన్ననాటి నుండి అన్నదమ్ముల వలె కలిసి ఒకే పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులంతా 29 ఏళ్ల తర్వాత ఒకే వేదిక వద్దకు రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనంతరం నాడు విద్య నేర్పిన గురువు దేవరపల్లి వెంకటరెడ్డిని శాలువలతో పూలమాలతో ఘనంగా సన్మానించి తమ గురువు పట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ ఆర్గనైజర్లు డాక్టర్ అనంతు హరీష్, కుంచెం ముత్తయ్య, కాసాని పుల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కారేపల్లి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన కామేపల్లి, కారేపల్లి మండల స్థాయి క్రికెట్ పోటీలలో కారేపల్లి జట్టు విజయం సాధించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జూపల్లి వినోద మెమోరియల్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఫైనల్ మ్యాచ్ కారేపల్లి, సూర్యతండా ల మధ్య ఉత్కంఠంగా నడిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కారేపల్లి నిర్ణీత 10 ఓవర్లలో 61 పరుగులు చేసింది. ఈజట్టులో తరుణ్ సాయి 23 పరుగులు సాధించి బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇదే జట్టులో పెద్దమ్మ వెంకటేశ్ 3 ఓవర్లు, 3 వికెట్లు తీశాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సూర్యతండా జట్టు 6 వికెట్లకు 48 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో 19 పరుగు చేయాల్సి ఉండగా ఆ ఓవర్‌లో ఫస్ట్ బాల్‌కు ఒక సిక్స్ కోట్టారు. దీంతో సూర్యతండా విజయం తథ్యం అనుకున్న దశలో వికెట్ కోల్పోవటంతో పరాజయం పాలైంది. ప్రథమ స్థానంలో నిలిచిన కారేపల్లి జట్టుకు రూ.15016/-, ద్వితీయ స్థానంలో నిలిచిన సూర్యతండా జట్టుకు రూ.10016/- నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈకార్యక్రమంలో జూపల్లి రాము, జూపల్లి నాగేందర్, అశోక్, సీహెచ్.రమణ, చెవుల చందు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద ఆగడాలను ఎదిరించడమే...

రోహిత్ వేములకు నిజమైన నివాళి

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం



మతోన్మాద కుల రక్కసికి బలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రీచర్చ్ స్కాలర్ రోహిత్ వేముల 7వ వర్ధంతి సందర్భంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్‌లోని సంఘం జిల్లా కార్యాలయంలో రోహిత్ వేముల చిత్రపటానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 2016లోని అప్పటి సెంట్రల్ యూనివర్సిటీ విసి, ఏబివిపి, అర్ఎస్ఎస్‌ల వేధింపుల వల్లనే స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యారంగంలో మత భావాలు చొప్పిస్తూ ప్రశ్నించే వారిపైన దాడులు, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో టీచర్ మల్లిఖార్జున్‌పై మతోన్మాదంతో దాడి చేశారని, తక్షణమే దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజేపి, ఆర్ఎస్ఎస్‌ల దాడులు, ఆగడాలు పెరిగిపోయాయని ఆరోపించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులపైన, బలహీన వర్గాలపైన, మైనార్టీలపైన దాడులు విపరీతంగా జరుగుతున్నాయని విమర్శించారు. అర్ఎస్ఎస్, బిజెపిల మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే రోహిత్ వేములకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఆఫీస్ బేరర్స్ పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. గౌస్, సిఐటియు నాయకులు జిల్లా ఉపేందర్, కెవిపిఎస్ నాయకులు నాదెండ్ల శ్రీనివాస్, బత్తిన ఉపేందర్, రైతు సంఘం నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, తిరపయ్య, మురళి, వీరయ్య, శేషగిరి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళిత టీచర్‌పై దాడికి సీఐటీయు నిరసన

నవతెలంగాణ- ఖమ్మం



నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జున్‌పై దాడికి నిరసనగా ఖమ్మంలోని ధర్నా చౌక్‌లో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ దళితుల మీద బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో లాగా రాష్ట్రంలో దళితుల మీద, మైనార్టీ వర్గాల మీద చేసే దాడులను సిఐటియు ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అలాగే దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద దాడులను ప్రోత్సహిస్తూ వారి ఆర్ఎస్ఎస్ విధానాలను ప్రజలకు కార్మికులకు అంట కట్టే విధంగా ప్రభుత్వ ఆస్తులను పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు, అంబానీ, ఆదానీలకు దోచిపెడుతూ దేశాన్ని అతి తక్కువ కాలంలో వారు చేసిన పరిపాలనలో 8 సంవత్సరాలలో 70 లక్షల కోట్లు అప్పు చేయడం గత ప్రభుత్వాలు ఆస్తులను నిర్మాణం చేస్తే ,ఈ ప్రభుత్వం ఆస్తులను అమ్మకానికి పెట్టి ప్రజలను మోసం చేస్తుందని, అలాగే మతతత్వాన్ని రెచ్చగొడు తుందన్నారు. ఇలాంటి విధానాలు తెలంగాణ రాష్ట్రంలో ఎప్పటికీ రానివ్వమని కలిసి వచ్చే కార్మిక రంగాలతో పార్టీలతో కలిసి పనిచేసి బిజెపి వ్యతిరేక శక్తులను కూడగట్టి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పేరంపల్లి మోహన్‌రావు, బండారు యాకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా ఉపేందర్, హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శీను, జిల్లా నాయకులు మాచర్ల గోపాల్, త్రీ టౌన్ కన్వీనర్ ఎర్ర మల్లికార్జున్, టూ టౌన్ కన్వీనర్ కాంపటి వెంకన్న, జిల్లా నాయకులు దొంగల తిరుపతిరావు, హవేలీ కన్వీనర్ పవన్, మురళి టూటౌన్ నర రమేష్, శెట్టి రవీందర్, ట్రాక్టర్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లింగయ్య, రామదాసు, నాయకులు కాసిం, ఎస్విఆర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కి ఎస్ఎఫ్ఐ బహిరంగ లేఖ

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి వడ్రానపు మధు బహిరంగ లేఖ రాశారు. ఖమ్మం జిల్లాలో ఉన్నత విద్యను సూమారు 60 వేల మంది చదువుతున్నారు. వీరికి యూనివర్శిటీలో ఏ అవసరాలు ఉన్న వరంగల్ కాకతీయ యూనివర్శిటీకి వందల కిలో మీటర్ల పాటు ప్రయాణం చేస్తూ వందల రూపాయలు వెచ్చించి వెళ్లి వస్తున్నారన్నారు. అశ్వారావుపేట, భద్రాచలం చుట్టుప్రక్కల గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పరిస్థితి అత్యంత ఇబ్బంది కరంగా ఉందన్నారు. యూనివర్శిటీ ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేస్తే ఉన్నత విద్య మరింత మందికి అందుబాటులో ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని,పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ 3,500 కోట్లను తక్షణమే విడుదల చేయాలని, నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని రావాలని, ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని, ప్రతి నియోజకవర్గానికి ఒక పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేయాలని, హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ శ్రీ చైతన్య నారాయణ ఇతర ప్రవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని వారి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలిరండి

ఎమ్మెల్యే రాములు నాయక్

నవతెలంగాణ-వైరా

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుటిల, నిరంకుశ రాజకీయ విధానాలపై సమర శంఖారావం పూరిస్తూ బుధవారం సాయంత్రం నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వైరా నియోజక ప్రజలు ఎమ్మెల్యే లావుడ్య రాములు నాయక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆందోల్ ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యా సంస్థల మౌలిక సదుపాయాల సంస్థల చైర్మన్ శ్రీధర్ రెడ్డి లతో కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తుల ఐక్యత కోసం కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, కేజ్రీవాల్, భగవంత్ మాన్ సింగ్, యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, సిపిఐ, సీపీఎం అగ్ర నాయకత్వం హాజరవుతున్న సభను విజయవంతం చేయటం అందరి బాధ్యత అని అన్నారు. వైరా నియోజక వర్గంలో అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు కదిలి, ప్రజలను సమీకరిస్తున్నట్లు వివరించారు. ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ గత పాలకులు ప్రజలకు పనికొచ్చే ఒక్క మంచి పనిచేయలేదని, కేసీఆర్ ముందు చూపుతో రాష్ట్ర ఏర్పాటు, ఆ తర్వాత 9 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని, మనకు ప్రకృతి ఇచ్చిన అపార వనరులను ఉపయోగించు కోవాలనే సంకల్పం కేసీఆర్‌కు ఉన్నదని, వారి నాయకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బి.చంద్రావతి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంపై అపారమైన నమ్మకంతోనే దేశ రాజకీయాలలో మార్పు కోరుతున్న వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు ఖమ్మం సభకు వస్తున్నందున, బిఆర్ఎస్ లోని అందరం కలిసి కెసిఆర్ ఆదేశాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వైరా నియోజక వర్గం నుండి ఖమ్మం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రానున్నారని అన్నారు. ఈ సమావేశంలో మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎంపీపీ వేల్పుల పావని, జడ్పిటిసి నంబూరి కనకదుర్గ, జడ్పి కో ఆప్షన్ సభ్యులు షేక్ లాల్ అహమ్మద్, మునిసిపల్ వైస్ చైర్మన్ ముళ్ళ పాటి సీతారాములు, ఏఎంసి చైర్మన్ బీడికె రత్నం, దిశా జిల్లా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున రావు, మచ్చా బుజ్జి, పనితి సైదులు, చేపల సొసైటీ అధ్యక్షులు రహీం, బిఆర్ఎస్ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు దార్ల శేఖర్, బాణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కామిశెట్టి కళ్యాణ మండపంలో మంటలు

5 లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-వైరా

వైరా మెయిన్ రోడ్డులో ఉన్న కామిశెట్టి వారి కళ్యాణ మంటపంలో మంగళవారం మధ్యాహ్నం గంటల సమయంలో మంటలు చెలరేగి మండపంలోని కుర్చీలు, సీలింగ్ క్లాత్, కర్టెన్ లు, ఇతర వస్తువులు కాలిపోయాయి. వైరా అగ్ని మాపక కేంద్రం నుండి వచ్చిన సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ అయితే మీటర్ ల వద్ద ఎలాంటి మంటలు లేచిన ఆనవాళ్లు లేవని, షార్ట్ సర్క్యూట్ జరిగితే విద్యుత్ బోర్డులో స్విచ్ లు పడిపోతాయని, ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఫీజులు లేచి పోతాయని అవేవీ జరగలేదని అందువల్ల మంటలకు షార్ట్ సర్క్యూట్ కాదని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. కాగా కళ్యాణ మంటపంలో 6 నిండు గ్యాస్ సిలిండర్‌లు ఉన్నాయని అవి పేలితే భారీ నష్టం వాటిల్లేదని, మంటపం ముందు బాగంలో ఉన్న వెంకటేశ్వర నర్సింగ్ హెూం, దుకాణ సముదాయాలకు మంటలు వ్యాపిస్తాయని భయంతో అందులో పనిచేస్తున్న వారు పరుగులు తీశారు. విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు ఉన్న గదికి సీల్ వేశారు. పోలీస్ అధికారులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు. మంటపం యజమాని కామిసెట్టి రాజారావు ఖమ్మంలో ఉంటారు. ఇక్కడ గుమస్తా కుటుంబం మాత్రమే ఉంటుంది.



ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిగుమాడు గ్రామంలో గ్రామ యూత్ దోర్నాలవెంకట రవి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సందర్భంగా మెగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ఈ ముగ్గుల పోటీలను గ్రామ పెద్దలు దోర్నాల కృష్ణ, యరదేశి మల్లికార్జునరావు, యన్నం రజిని, రావూరి రంగారావు, తిరువేదుల వెంకటేశ్వరరావు, వార్డ్ కౌన్సిలర్ పగిడిపల్లి విజయమ్మ కాశీ రావు, దోర్నాల గోపయ్య సంపసాల రామకృష్ణ, వేల్పుల కొండ, దోర్నాల మణి బాబు, దోరణాల శ్రీను, దోర్నాల జాను తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.

బీఆర్ఎస్ ఖమ్మం సభను విజయవంతం చేద్దాం

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



నవతెలంగాణ- సత్తుపల్లి

నేడు ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ శ్రేణులను కోరారు. ప్రతి గ్రామం నుంచి వెళ్తున్న కార్యకర్తలు, ప్రజల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. బహిరంగ సభకు తీసుకెళ్లిన వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని ఆయా గ్రామాల నాయకత్వాలను ఎమ్మెల్యే సండ్ర ఆదేశించారు. సభకు తీసుకెళ్లే వారితోనే నాయకులు ఉండాలని, సభానంతరం వారిని సురక్షితంగా ఇండ్లకు తీసుకెళ్లే బాధ్యత కూడా నాయకులదేనని ఎమ్మెల్యే సండ్ర స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు

నవతెలంగాణ-కూసుమంచి

ఖమ్మంలో నేడు జరిగే బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభకు విచ్చేసిన రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రావులకు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి స్వాగతం పలికారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ- బోనకల్



మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ మంగళవారం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రామాపురం, గార్లపాడు గ్రామాలలో కంటి వెలుగు ఫ్లెక్సీల ఏర్పాటును పరిశీలించారు. చిరునోములలో నర్సరీ, డంపింగ్ యార్డ్ ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ కార్యదర్శులు నర్సరీలు, డంపింగ్ యార్డ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కళ్యాణపు సౌమ్య, నాగేశ్వరరావు, బంధం అర్జున్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సభతో దేశ రాజకీయాలలో పెనుమార్పులు

కేంద్రం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ఎండగడతాం

దేశం యావత్ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోంది..

బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు కె. కేశవరావు , బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



నేడు దేశం యావత్ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు కె. కేశవరావు , బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం సభతో దేశ రాజకీయాలలో పెనుమార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఖమ్మంలో సభా వేదికను సందర్శించి, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశం అబ్బుర పడేలా ఖమ్మం సభను ప్రజల మద్దతుతో బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కనీవినీ ఎరుగని రీతిలో సభ ఉంటుందని, విస్తృతమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సభ ద్వారా బీఆర్ఎస్ ఎజెండాను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి దేశ రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తామని అన్నారు. ప్రజల మద్దతుతో రాష్ట్రంలో బీఆర్ఎస్ దే మళ్లీ అధికారమని స్పష్టం చేశారు. ఖమ్మం సభ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. 5 లక్షల మందితో నిర్వహించే ఖమ్మం సభ ప్రజా, రైతు వ్యతిరేక కేంద్ర పాలకులకు చెంప పెట్టులా ఉంటుందని అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దామోదరరావు, వెంకటేష్ నేత, సురేష్ రెడ్డి, రాష్ట్ర విద్య, సంక్షేమం కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

కేకేకు సన్మానం

సభలో పాల్గొనేందుకు ఖమ్మం వచ్చిన బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు కె. కేశవరావు, ఎంపీలు దామోదరరావుకు, సురేష్ రెడ్డి, వెంకటేష్ నేత, వద్దిరాజు రవిచంద్ర కు ఘన స్వాగతం లభించింది. ఎంపీ నామ నాగేశ్వరరావు స్వగృహానికి చేరుకున్న వారికి ఎంపీ నామ స్వాగతం పలికి, వారిని శాలువతో సన్మానించారు.

టీఆర్ఎస్ గ్రామ అధ్యక్ష పదవికి 'బంధం' రాజీనామా

నవ తెలంగాణ - బోనకల్



మండలంలో మేజర్ గ్రామపంచాయతీ రావినూతల గ్రామానికి చెందిన బంధం తిరుపతి రావు బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష పదవికి మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావుకి పంపించినట్లు తిరుపతిరావు తెలిపారు. బీఆర్ఎస్‌లో జరుగుతున్న విషయాలకు కలత చెంది ఈ రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు బలమైన సామాజిక వర్గానికి చెందిన తిరుపతిరావు రాజీనామా చేయటంతో రావినూతలలో ఆ పార్టీకి షాక్ తగలనున్నది.



మిర్చి రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన

నవతెలంగాణ-వైరాటౌన్

మిర్చి పంటకు గత రెండు వరస సీజన్లలో వైరస్, తెగుళ్ళ సోకి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వైపరీత్యం క్రింద మిర్చి రైతులకు నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు.మంగళవారం వైరా మండలం గొల్లెనపాడు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతులు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత రెండు వరస సీజన్లలో వైరస్, తెగుళ్ళ సోకి మిర్చి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఖమ్మం జిల్లాలో గత సీజన్లో లక్ష ఎకరాలలో, ఈ సీజన్లో 70 వేల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి పంట పూర్తిగా దెబ్బతిందని అన్నారు. ఎకరం మిర్చి పంట సాగు కోసం రైతులు రెండు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నష్టపోతున్నారని, వైరస్, తెగుళ్ళ సోకిన మిర్చి పంటను కాపాడుకోవడానికి అధిక ధర ఉన్న పురుగు మందులు వాడటం వలన మరింత భారం రైతు పైన పడుతుందని, ప్రభుత్వం కనీసం పంట నష్టం గురించి సర్వే కూడా జరపడం లేదని, ఖమ్మం జిల్లాలో ఎక్కువ మిర్చి పంట సాగు అవుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి మిర్చి పంటకు నష్టం పరిహారం అందించేందుకు ఖమ్మం సభలో ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి అమరనేని వెంకటేశ్వరావు, జిల్లా నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, గ్రామ అధ్యక్షులు ఆళ్ళ శ్రీనివాస్, కార్యదర్శి వెంపటి రాజా, కొణిదన ధర్మారావు, నల్లమోతు రాజబాబు, అమరనేని సాంబశివరావు, ఆళ్ళ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో కెసీఆర్‌కు వీఆర్ఎస్ ఖాయం

సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని, ఇక్కడ ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తానన్నాడంట అలా ఉంది కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పరిస్థితి అని అన్నారు.

రాష్ట్రంలో పంచాయతీలకు నిధులు ఇవ్వలేని ప్రభుత్వం బీఆర్ఎస్‌తో దేశాన్ని బాగు చేస్తదా అని విమర్శించారు. స్థానిక మంత్రి నాయ పైసా కూడా హైదరాబాద్ నుండి తీసుకురాలేదని, జిల్లా ప్రజలు కట్టే పన్నులు, ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లతో వచ్చే ఆదాయంతో తన ఆస్తులు ఉన్న ఏరియాలో నాలుగు డివైడర్లు, కలర్ఫుల్ లైట్లు వేయించి అభివృద్ధి చేశామని చెప్పి డప్పు కొట్టుకుంటున్నారని విమర్శించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ అధికారాలు ఎవరికి శాశ్వతం కాదని అన్నారు. హరీష్ రావు కాంగ్రెస్ గురించి మాట్లాడే ముందు గతంలో కాంగ్రెస్ ఏం చేసిందో గుర్తుచేసుకుని మాట్లాడాలని అన్నారు. పార్టీ బహిరంగ కోసం కలెక్టర్ స్వయంగా డోజర్ దగ్గర నిలబడి సభా స్థలిని శుభ్రం చేయించడం ఎక్కడా చూడలేదని అన్నారు. కేసీఆర్ నియంతత్వ పోకడలకు కాలం చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. విలేకరుల సమావేశంలో పాలేరు నియోజకవర్గ పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఖమ్మం నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజులా నరేందర్, ముస్తఫారఫేదాభేగం, రాష్ట్ర మైనారిటి నాయకులు బి యచ్ రబ్బాని, నగర బిసి సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నగర మైనారిటి అధ్యక్షులు అబ్బాస్, నగర ఐయన్‌టియుసి అధ్యక్షులు నరాల నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకుందాం

పార్టీ ప్రచారానికి సోషల్ మీడియా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ- ఖమ్మం



శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలు అందుబాటులోకి వచ్చాయని, మారిన కాలంలో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజా పోరాటాలను విస్తృత పర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో యర్రాబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ మీడియాలో అనేక మార్పులు వచ్చాయని, సోషల్ మీడియా ఇప్పుడు ప్రధాన భూమిక పోషిస్తుందని, దానిని ప్రజాపోరాటాలకు, పార్టీ ప్రచారాలకు అన్వయించుకోవాలని ఆయన కోరారు. బిజెపి లేదా ఇతర సంస్థలు సోషల్ మీడియా ద్వారా విషం చిమ్ముతున్నాయని లేనిది ఉన్నట్లుగా ఉన్నది లేనట్లుగా ప్రచారం చేస్తూ ప్రజలకు తప్పుడు సంకేతాలను ఇస్తున్నాయన్నారు. బిజెపి సోషల్ మీడియా విభాగం వామపక్ష భావజాలంపై విషం కక్కుతుందని, ఇటువంటి విష ప్రచారాలను ఎదుర్కొనేందుకు వామపక్ష బావజాలం కలిగిన వ్యక్తుల మధ్య పరస్పర సమాచార మార్పిడి అవసరం అన్నారు. పార్టీ కార్యక్రమాలు ఇతరత్రా ప్రచారాలకు సోషల్ మీడియాను వేదిక చేసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా, కార్యదర్శి పోటు ప్రసాద్, కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వాలి

పోడు హక్కుపై సీఎం ప్రకటన చేయాలి : గిరిజన సంఘం

నవతెలంగాణ-కారేపల్లి



తండాల అభివృద్ధికి గ్రామపంచాయతీలుగా మార్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. మంగళవారం కారేపల్లిలో గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో భూక్యా వీరభద్రం నాయక్ మాట్లాడుతూ పంచాయతీలలో నిధులు లేక అభివృద్ధి చెందటం లేదన్నారు. పోడు చేసుకుంటున్న పేదలు పోడుపై హక్కుకు నిరీక్షిస్తున్నారన్నారు. పంచాయతీలకు నిధులు, పోడు హక్కుపై ఖమ్మంలో జరుగు బీఆర్ఎస్ బహిరంగ సభలో ప్రకటన చేయాలని కోరారు. పోడుపై ముఖ్యమంత్రి స్పందించకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు రైతుల పోరు బాటకు కార్యాచరణ పూనుకున్నట్లు తెలిపారు. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న గిరిజన సంఘం ఖమ్మం జిల్లా మహాసభలు ఫిబ్రవరి మాసంలో కారేపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు భూక్యా లక్ష్మన్‌నాయక్, బానోత్ శ్రీను, బాలు, మాలోత్ రాంకోటి, భూక్యా రమేష్, రామారావు, తేజావత్ కృష్ణకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నీని ప్రారంభించిన కొండూరి

నవతెలంగాణ-కల్లూరు



పట్టణం శాంతినగర్‌లో గల కమ్యూనిటీ ఆవరణలో మంగళవారం రాత్రి ఒపీటీసీ సభ్యులు కొండూరి కిరణ్ కుమార్ షటిల్ టోర్నీని రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, క్రీడాలను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీ లోకల్ టీంలు 18 వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కె.స్వరూపరమేష్, కమిటీ సభ్యులు శంకర్, అప్పారావు, శివ, కన్నా, గోపాల్, వీరేందర్, క్రీడాకారులు విరివిగా పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదుల దుశ్చర్యలను ఖండించాలి

- నాబార్డు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు నిరసన ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్
- కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, నిరసనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో/కంఠేశ్వర్

నిజామబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషిస్తూ, బలవంతంగా గుడికి తీసుకెళ్ళి బొట్టు పెట్టించి, అతన్ని అవమానిస్తూ, గ్రామ వీధుల్లో ఊరేగించి, అనాగరిక చర్యలకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద దుండగులు చేసిన దుశ్చర్యలను ఖండించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి, సామూహిక వినతి పత్రాలను అందించారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో నాబార్డు బ్యాంక్ నుంచి ప్రదర్శన నిర్వహించి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. 4 నెలల కిందట మల్లిఖార్జున్ అనే టీచర్ వినాయక చవితికి చందా ఇవ్వలేదనే కక్షతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ఈ ఘోరానికి ఒడిగట్టారని, మల్లిఖార్జున్‌ను అత్యంత అమానుషంగా కించపర్చారన్నారు. బడి నుంచి గుడి వరకు బలవంతంగా మెడలు పట్టి కొట్టుకుంటూ లాక్కెళ్ళి జైశ్రీరామ్ అని అనాలని ఒత్తిడి చేస్తూ, అతనికి బొట్టు పెట్టి మనోభావాలను దెబ్బతీసి, కులం పేరుతో దూషించి తీవ్రమైన పరుష పదజాలాలతో హేళన చేయడం దుర్మార్గమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని, మనిషిలాగా చూడలేని దుర్మార్గపు స్థితి బీజేపీ పాలనలో సర్వసాధారణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలగుడు భాస్కర్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నదని, మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఊనా పట్టణంలో ఆవు మాంసం వలుస్తున్నారనే నెపంతో నలుగురు దళిత యువకులను చెట్టుకు కట్టేసి కొట్టి, తమ కారుకి కట్టి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని, ఒక దళితుడు గుర్రం ఎక్కాడని కిందపడేసి కొట్టి చంపారని, యూపీలో ఓ దళిత యువతిని హత్రాస్‌లో సామూహిక లైంగికదాడి చేసి, నాలుక కోసి, నడుములు విరిచినా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా తీసుకోలేదన్నారు. హాస్పిటల్‌లో బాధితురాలు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణిస్తే కనీసం ఆ శవాన్ని కూడా కుటుంబానికి ఇవ్వలేదని, ఇలాంటి దారుణాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మరెన్నో జరుగుతున్నాయని గుర్తుచేశారు. వీటన్నింటిలో భాగంగానే కోటగిరి స్కూల్ టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి జరిగిందన్నారు. తెలంగాణలో 70 కుల దురహంకార హత్యలు జరిగాయని, మంథని మధుకర్, ఆంబోజి నరేష్, పెరుమాండ్ల ప్రణయ్ వంటి హత్యలు రాష్ట్రాన్ని కుదిపేశాయన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీల) పేరుతో సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, దాడికి పాల్పడిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ, భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, ఎం.వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్, పి.సునీత, ప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె.కుమార్, కోశాధికారి ఆర్.వాణి, సిటీ నాయకులు రాములు, సత్తయ్య, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. దళిత టీచర్ మల్లికార్జున్‌పై పోలీసుల సమక్షంలో దాడి జరుగుతున్నప్పటికీ పట్టించుకోకుండా వ్యవహరించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక లౌకికవాదులు ప్రశ్నిస్తే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని, వారిపై దేశద్రోహులుగా ముద్ర వేసి దేశం విడిచి పోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ ప్రజాస్వామిక లౌకికవాదులు ఏకమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మల్యాల గోవర్ధన్, చక్రపాణి మోహన్, నన్నేసాబ్, డి. కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మారితే సరిపోదు.. సరికొత్త విధానాలుండాలి

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



నవతెలంగాణ- ఖమ్మం

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మారిస్తే సరిపోదని.. సరికొత్త విధానాలుండాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ లాంటి మరో జాతీయ పార్టీగా బీఆర్ఎస్ ఆవిర్భవిస్తే దేశానికి ఏమంత ప్రయోజనం ఉండదని, మిలిగిన పార్టీల లాగానే అదొక పార్లమెంటరీ పార్టీ అవుతుందన్నారు. మతోన్మాదం, నిరంకుశత్వంతో దేశాన్ని ఫాసిస్టు ప్రమాదంలోకి తీసుకపోతున్న మతోన్మాద పాలకుల పాలనా నేపథ్యంలో నేడు దానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్షాల ఐక్యత ఎంతో దేశానికి అవసరమని తెలిపారు. అయితే 8 ఏండ్ల టీఆర్ఎస్ పాలనలో కొన్ని సంస్కరణలు, పథకాల అమలు జరిగింది గానీ, ప్రజాస్వామిక హక్కుల విషయంలో, నిరుద్యోగం, నియామకాలు చేపట్టడంలో, కౌలు రైతులు, రైతుల ఆత్మహత్యలు ఆపడంలో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, విద్యా, వైద్యం, విద్యార్థులు, గిరిజనులు, దళితులు, బడుగువర్గాల ఆశయం నెరవేర్చడంలో సఫలం కాలేదన్నారు. ఈ స్థితిలో బీఆర్ఎస్ ఏర్పాటుపై అనేక ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయని, నిన్నటి దాకా బీజేపీకి పార్లమెంట్‌లో జీఎస్టీ, నోట్ల రద్దు, 370 ఆర్టికల్, పౌరసత్వ చట్టం లాంటి ఎన్నో ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక చట్టాల్లో టీఆర్ఎస్ భాగస్వామి అయిందని, ఇప్పుడు ఆకస్మాత్తుగా ఘర్షణ పడుతుందని, కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వం మీద జరిగే ఈ ఘర్షణ నికరంగా ఉండాలని ఆశిస్తున్నామన్నారు. ఎన్నికల కోసమే ఈ ఘర్షణ కాకుండా, నిజమైన రాష్ట్రాల హక్కుల సాధనకు నిలబడాలని కోరుతున్నామని చెప్పారు. అలానే ఎన్నికల ముందు కాంగ్రెసేతర ప్రతిపక్షాల ఐక్యత అంటూ బీజేపీకి పరోక్షంగా లాభం చేకూర్చే 'బి' జట్టుగా మారవద్దని సూచిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య సివై.పుల్లయ్య, శివలింగం, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీం కోర్టులో పిటిషన్

- కేంద్ర ప్రభుత్వం కౌంటర్ అపిడవిట్ దాఖలు చేయాలి: తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్‌లో భాగంగా గిరిజనులకు కల్పించిన 1/70 చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన సూరెడ్డి రమణారెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారనీ, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అపిడవిట్ దాఖలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ హక్కులను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నదని పేర్కొన్నారు.. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే భాష నినాదాలతో ముందుకు పోతున్నదని తెలిపారు. అందుకు ఆటంకమైన చట్టాలన్నింటిని రద్దు చేయాలని పూనుకున్నదని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు 100శాతం విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న జీవో నెంబర్ 3 ని న్యాయస్థానం ద్వారా రద్దు చేయించిందని తెలిపారు. అటవీ సంరక్షణ నియమాలు2022 పేరుతో పెసా 'చట్టాన్ని రద్దు చేసేందుకు వచ్చే పార్లమెంట్‌లో చట్టం చేయబోతున్నదని పేర్కొన్నారు. బీజేపీ మద్దతుదారులే 1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు.

భాషాపండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

నవతెలంగాణ-సిద్ధిపేట

భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని కోరుతూ తెలుగు, హిందీ, ఉర్దూ పండితులు, పీఈటీలు మంగళవారం సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో భాషా పండితులు పదో తరగతి వరకు బోధిస్తూ వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. నూతనంగా నియామకమైన స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగుల కంటే కేడర్ తక్కువగా ఉండటంతో చిన్నచూపునకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

జోన్‌ల పేరుతో.. కంపెనీలకు భూములు కట్టబెట్టే యత్నం

- మాస్టర్ ప్లాన్ రద్దు చేయాల్సిందే : ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్
- 20న విప్ ఇంటి ముట్టడి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

భూ సేకరణ చట్టం-2013 ప్రకారం భూములు సేకరించేందుకు 80 శాతం మంది రైతులు అంగీకరించాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రకరకాల జోన్ల పేరుతో రైతులను ఇక్కట్లు పెట్టి వారి భూములు లాక్కొని కంపెనీలకు కట్టబెడుతోందని ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. దాంట్లో భాగంగానే కామారెడ్డి, జగిత్యా లలో మొదటి విడుతగా అమలు చేసేందుకు యత్నిస్తుందని చెప్పారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్యకార్యా చరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి జిల్లా పాతం రాజంపేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశానికి సారంపల్లి మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని, కంపెనీలు పెట్టేం దుకు కామారెడ్డిలో తాము భూములు చూపిస్తామని చెప్పారు. భూములు రక్షించుకోవడం కోసం రైతులకు అండగా ఏఐకేఎస్ పోరాడుతోందని తెలిపారు. ఉద్యమాలను ఉధృతం చేస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్, మల్లేష్, నర్సింలు, కమ్మరి సాయిలు, మధు, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



20న విప్ ఇంటి ముట్టడి

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయకుంటే ఈ నెల 20వ తేదీన ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఇంటి ముట్టడికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం చేసింది. మంగళవారమిక్కడ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. గుంట భూమి కూడా రైతులకు నష్టం కలిగించే ప్రసక్తే లేదని చెప్తున్న కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే మాట ప్రకారం ఈ నెల 19 వరకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం పెట్టి మాస్టర్ ప్లాన్ రద్దుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే 19వ తేదీ 3 గంటల వరకు విలీన గ్రామాలకు చెందిన 9 మంది కౌన్సిలర్లు రైతులకు మద్దతుగా, మాస్టర్‌ప్లాన్‌కి వ్యతిరేకంగా రాజీనామా చేయాలని కోరారు. ఒక వేళ ఎవరైనా రాజీనామా చేయకపోతే వారిపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, తమతో కలిసి వచ్చిన కౌన్సిలర్లతో కమిషనర్‌కు రాజీనామా ఇస్తామని అన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- మాస్టర్‌ప్లాన్‌తో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన



(ఫైల్)



మాట్లాడుతున్న రైతు భార్య

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఇప్పటికే సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే మరొక రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మర్రిపల్లి బాలకృష్ణ, సంతోష్ ఇద్దరు అన్నదమ్ములు. వీరికి సర్వే నంబర్ 89లో ఎకరం భూమి ఉంది. అయితే బాలకృష్ణకు ఇద్దరు ఆడపిల్లలు (కవలలు) మిధున, మేఘన ఉన్నారు. ప్రస్తుతం వారు తాడ్వాయి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అయితే ఇద్దరు పిల్లలు డాక్టర్ చదువు కోసం ప్రయత్నిస్తున్నారు. దానికోసం తన భాగం భూమిని అమ్మడానికి ప్రయత్నించగా గతంలో రూ.70 లక్షలు పలికింది. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్‌తో గ్రీన్‌జోన్‌లోకి తన భూమి రావడంతో రూ.20 లక్షలకు కూడా అడగడం లేదు. దాంతో తన పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని మనస్తాపం చెందిన బాలకృష్ణ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఇంటికి వచ్చి విషయం చెప్పాడు. దాంతో అతన్ని హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విషయం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులకు తెలియడంతో ఆస్పత్రికి వెళ్లి బాలకృష్ణను పరామర్శించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అతన్ని ఎల్లారెడ్డిపేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రైతు బాలకృష్ణ భార్య లక్ష్మీ మాట్లాడుతూ.. తమ భూమి మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్లో పోతుందని తెలిసి తన భర్త ఆవేదనకు గురయ్యాడన్నారు. నెల రోజులుగా రైతులతో కలిసి ఉద్యమంలో కూడా పాల్గొంటున్నాడని తెలిపారు. తమ భూమి మాస్టర్ ప్లాన్‌లో పోకుండా చూడాలని ఆమె వేడుకుంది.

20 మంది ఎమ్మెల్యేలను మారిస్తే.. 75-100 సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుంది

- మంత్రి 'ఎర్రబెల్లి' వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌లో కలకలం
- 'నవతెలంగాణ' కథనంతో చర్చ..



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తాజా వ్యాఖ్యలు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలల్లో కలకలం సృష్టించింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో మంగళవారం నిర్వహించిన ఖమ్మం బహిరంగసభ సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. తాను నిర్వహించిన సర్వేలో 15-20 మంది ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందని వెల్లడైందని, తన సర్వే ఎప్పుడూ తప్పు కాలేదని తెలిపారు. వీరిని మారిస్తే 75-100 సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. ఈసారి సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్‌లు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో 'ఎర్రబెల్లి' వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టించాయి. సీఎం కేసీఆర్‌కు కొంత మంది ఎమ్మెల్యేలపై కోపం ఉందని ప్రకటించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీకి పట్టు లేదని, మూడు, నాలుగు జిల్లాల్లో 15 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బీజేపీకి మధ్య పోటీ ఉంటుందని, ఆరేడు జిల్లాల్లో మరో 20-25 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటుందని స్పష్టం చేశారు.

'నవతెలంగాణ' కథనంతో చర్చ..

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, డాక్టర్ టి రాజయ్య మధ్య జరుగుతున్న వాగ్యుద్ధం నేపథ్యంలో కొత్త నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయని మంగళవారం 'నవతెలంగాణ'లో రాజకీయ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేసిన వ్యాఖ్యలతో 'నవతెలంగాణ' కథనం.. ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 11 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఎంత మందిపై వ్యతిరేకత ఉందో మంత్రి 'ఎర్రబెల్లి'కే ఎరుక అంటూ పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, మహబూబాబాద్ ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై బహిరంగంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి 'ఎర్రబెల్లి' వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

త్వరగా అలసిపోతున్నారా..?



ఇంటి పనీ.. ఆఫీసు పనీ.. వేళలకు మించి చేసుకుంటూ వెళితే శరీరం తట్టుకోవడం చాలా కష్టం. ఊరికే జబ్బు పడటం.. త్వరగా అలసిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీన్నే 'బర్న్ అవుట్'గా చెబుతున్నారు నిపుణులు. మీలోనూ ఆ లక్షణాలు కనిపిస్తున్నాయా?

- ఆఫీసుకొచ్చాక ఎన్నిసార్లు కుర్చీలోంచి లేచారు? 'పని చేయడం లేదనో, ఎప్పుడూ తిరుగుతూనే ఉంటుందనో' అనుకుంటారని భయం. అలాగని ఏకధాటిగా కూర్చొని కంప్యూటర్ వంక చూడటమూ మెదడును అలసిపోయేలా చేస్తుందని మీకు తెలుసా? గంటకో సారైనా కుర్చీలోంచి లేవండి. పక్కకు వెళ్లి మానసికంగా, శారీరకంగా ఎలా అనిపిస్తోందో అంచనా వేసుకోండి. నెగెటివ్ ఆలోచనలు మొదలవుతున్నాయి అనిపిస్తే.. మీ పని విధానంలో మార్పులు చేసుకోవాలని అర్థం.
- ఏ సందర్భంలోనైనా ఒకరు తోడున్నారన్న ఆలోచన ఎంత బాగుంటుంది. పని ప్రదేశంలో తప్పనిసరి కాబట్టి, అందరితోనూ బాగానే మాట్లాడతాం. నిజమైన స్నేహితులున్నారా? ఆఫీసులో బాగా నచ్చినవారితో స్నేహం చేయండి. కలిసి తినడం.. సరదాగా కబుర్లు చెప్పుకోవడం, మీ ఒత్తిడిని పంచుకోవడం.. అవతలి వారి ఇబ్బందులను వినడం లాంటివి చేయండి. 'బర్న్ అవుట్' పరిస్థితి దరిదాపుల్లోకీ రాదట. అయితే.. ఆఫీసు రహస్యాలు, బృందానికి సంబంధించిన ఆలోచనలను మాత్రం పంచుకోవద్దు.
- ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్న కొద్దీ మందులను ఆశ్రయించేవారే ఎక్కువ. రోజూ కనీసం 20 నిమిషాలు నడిస్తే.. ఆ పరిస్థితి రాదంటున్నారు నిపుణులు. చిన్న చిన్న వర్కవుట్లకు మరో 15 నిమిషాలు కేటాయిస్తే చాలు. వ్యాయామం ఎగ్గొట్టడానికి ఇంట్లో పనిని సాకుగా మాత్రం చెప్పొద్దు. రోజూ కాసేపు పాటలు వినడం, కథలు చదవడం వంటివీ జోడించుకుంటే శరీరం, మనసు రెండూ దృఢంగా మారతాయి.
- త్వరగా లేవడంపై ఉన్న శ్రద్ధ త్వరగా పడుకోవడంపై ఉండదు మన ఆడవాళ్లకి. తిండి విషయంలోనూ అంతే.. అందరికీ దగ్గరుండి అన్నీ సమకూర్చుతాం కానీ.. మన సంగతి పక్కన పెట్టేస్తాం. ఇదీ ఒత్తిడి, అలసటకి కారణమేనంటున్నారు నిపుణులు. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారం, వేళలకు తినడం అనే సూత్రాన్ని తప్పక పాటించండి. తగ్గాలి.. నాజూగ్గా కనిపించాలి అని బలవంతంగా చేసే డైట్‌లూ ఈ సమస్యను పెంచుతాయి. మనస్ఫూర్తిగా కొనసాగించాలనిపిస్తే సరే.. లేదా.. డైట్ మార్గం మార్చండి. వీటివల్ల 'బర్న్ అవుట్' దరిచేరదు.

ఇట్ల చేద్దాం



చెంచా చొప్పున పాలపొడి, శనగపిండి, నారింజ రసాన్ని కలిపిన మిశ్రమాన్ని ముఖం, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేస్తే చాలు. ఎండవల్ల కమిలిన చర్మం పూర్వపు స్థితికి వస్తుంది. రెండు చెంచాల పెరుగు, చెంచా పాలపొడి, అరచెంచా నిమ్మరసం కలిపిన మిశ్రమాన్ని ముఖానికి రాసి 20 నిమిషాలు ఆరనిచ్చి కడగాలి. పిగ్మెంటేషన్ మచ్చలు దూరమై చర్మం తాజాగా మారుతుంది.

> యుపీఎస్ఆర్‌టీసీ మహిళా డ్రైవర్ల కోసం ఖాళీ పోస్టులను ప్రకటించినప్పుడు నేను దరఖాస్తు చేసాను. మేలో శిక్షణ పాసయ్యాను. సెప్టెంబర్‌లో పోస్టింగ్ పొందాను. ప్రస్తుతం మా జీతం తక్కువగా ఉంది. అయితే ఆరు నెలల తర్వాత పోస్టును క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు.

లింగ వివక్షను విచ్ఛిన్నం చేస్తూ...

అవకాశాలు కల్పిస్తే మహిళలు ఎక్కడైనా, ఏ రంగంలోనైనా రాణించగలరు. దీనికి మరో ఉదాహరణగా నిలిచారు ప్రియాంక శర్మ... ఇప్పుడు ఆమె తన రాష్ట్రంలో ప్రభుత్వ బస్సును నడిపిన మొట్టమొదటి మహిళా డ్రైవర్‌గా చరిత్ర సృష్టించింది. దేశంలో మహిళా అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులే. ఇక ఉత్తర భారతదేశంలోని మహిళల పరిస్థితి మరింత ఘోరం. అలాంటి చోట ఆమె మహిళా డ్రైవర్‌గా పని చేస్తూ తనలాంటి ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆమె పరిచయం...



ఉత్తరప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (యుపీఎస్ఆర్‌టీసీ) ఇటీవలే 26 మంది మహిళా డ్రైవర్లను ప్రభుత్వం నడుపుతున్న బస్సులకు నియమించింది. ప్రియాంక శర్మతో పాటు ఇతర మహిళలు లింగ వివక్షను విచ్ఛిన్నం చేసే అవకాశాన్ని పొందారు. దీంతో రాష్ట్ర చరిత్రలో ప్రభుత్వ నడుపుతున్న బస్సును నడిపిన తొలి మహిళగా ప్రియాంక నిలిచారు.

భర్త చనిపోవడంతో...



ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాంక 2002లో షోరూమ్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస రాజీవ్ సింగ్‌ను వివాహం చేసుకుంది. అయితే అతను మద్యానికి బానిసై కుటుంబాన్ని అస్సలు పట్టించుకునేవాడు కాదు. ఇద్దరు పిల్లలు పుట్టినా అతనిలో మార్పు లేదు. తాగి తాగి కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. చివరకు 2016లో చనిపోయాడు. తినడానికి కూడా తిండిలేని ప్రియాంక తన ఇద్దరు కొడుకులతో బిక్షాటన చేయాల్సి వచ్చింది. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆమె ఉపాధి కోసం దేశంలోని ఎన్నో ప్రాంతాలకు వలస వెళ్ళింది.

ఆదాయం సరిపోయేదికాదు

జీవనోపాధి కోసం ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి ప్రదేశాలలో నివసించింది. మొదట ఢిల్లీ వెళ్ళిన ఆమె ఓ ఫ్యాక్టరీలో హెల్పర్‌గా పని చేసింది. కొన్ని రోజులు టీ స్టాల్ కూడా నడిపింది. అయితే వచ్చిన ఆదాయం తన కుటుంబానికి ఏ మాత్రం సరిపోయేది కాదు. దాంతో డ్రైవింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకుంది. తెలిసిన వారి వద్ద శిక్షణ తీసుకుని ఓ ట్రక్కు నడపడం మొదలుపెట్టింది. "డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాత నేను పిల్లలను తీసుకుని ముంబయి వెళ్ళాను. డ్రైవింగ్ కోర్సును పూర్తి చేసి అవసరమైన లైసెన్స్‌ను కూడా పొందాను. ట్రక్కు డ్రైవర్‌గా బీహార్, బెంగాల్, మహారాష్ట్ర, అస్సాం వరకు కూడా ప్రయాణం చేశాను" అంటున్నారు ఆమె. చివరకు యుపీ ప్రభుత్వం పబ్లిక్ ట్రాన్స్ పోర్టులో మహిళా డ్రైవర్ల కోసం నోటిఫికేషన్ వేయడంతో ఆమె కూడా దరఖాస్తు చేసుకుంది.

వేధింపులు ఎక్కువ

సాధారణంగా ఈ రంగంలో పని చేసే మహిళలపై వేధింపులు, సమస్యలు ఎక్కువగా ఉంటాయి. వాటికి భయపడి చాలా మంది మహిళలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నడిపేందుకు ఇష్టపడరు. అయితే కుటుంబం గడవడానికి ప్రియాంక ధైర్యంగా ఈ వృత్తిలతోకి ప్రవేశించింది. మహిళలను డ్రైవర్లుగా నియమించాలని యుపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో దరఖాస్తు చేసుకుంది.

జీతం తక్కువ...

"యుపీఎస్ఆర్‌టీసీ మహిళా డ్రైవర్ల కోసం ఖాళీ పోస్టులను ప్రకటించినప్పుడు నేను దరఖాస్తు చేసాను. మేలో శిక్షణ పాసయ్యాను. సెప్టెంబర్‌లో పోస్టింగ్ పొందాను. ప్రస్తుతం మా జీతం తక్కువగా ఉంది. అయితే ఆరు నెలల తర్వాత పోస్టును క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. శాఖ అధికారుల నుండి మాకు భవిష్యత్‌లో మంచి మద్దతు లభిస్తోంది" అని ప్రియాంక అన్నారు.

పర్మినెంట్ చేయాలని



ప్రస్తుతం ప్రియాంక ఆ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 26 మంది మహిళా డ్రైవర్లలో ఒకరు. ఆమె కౌశాంబి బస్ డిపో నుండి డెహ్రాడూన్, రిషికేశ్, మీరట్, లక్నో, మొరాదాబాద్, బరేలీలకు సుదూర బస్సును నడుపుతోంది. 50 మంది ప్రయాణికులను కౌశాంబి నుండి మీరట్‌కు నడపడం ఆమె మొదటి కర్తవ్యం. ప్రస్తుతం ఆమె కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తుంది. భవిష్యత్‌లో ప్రభుత్వ రంగంలో శాశ్వత ఉద్యోగం పొందాలని ఆమె ఆశిస్తోంది. అది తనకు, తన కుటుంబాన్ని చూసుకోవడానికి ఎంతో అండగా ఉంటుందని ఆమె భావిస్తుంది. ప్రియాంక వంటి మహిళలు జీవిత పాఠాలను అందిస్తారు. ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చే చోదక శక్తిగా నిలుస్తారు.

కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలు



సాధారణంగా నెలసరి సమయంలో ఎక్కువమంది సతమతమయ్యేది అధిక రక్తస్రావం, కడుపునొప్పి సమస్యలతోనే. ఇలాంటప్పుడు సరైన పోషకాహారం తీసుకుంటూ వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎప్పటిలా తాజాగా, హుషారుగా ఉండచ్చు.

- నెలసరి సమయంలో జరిగే అధిక రక్తస్రావం వల్ల శరీరం ఎక్కువ మొత్తంలో రక్తాన్ని కోల్పోతుంది. అందుకే చాలామంది అమ్మాయిలు నీరసించిపోతారు. ఈ సమస్యను అరికట్టడానికి తాజా పండ్లరసాలు, తక్షణ శక్తినిచ్చే ఆహార పదార్థాల మీద దృష్టి పెట్టాలి. ఫలితంగా శరీరం నీరసించిపోకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే నెలసరి సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలి. పెరుగు, ఒమేగా-3 అధికంగా ఉండే నట్స్, తాజా కూరగాయలు, తాజా పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి నెలసరితో వచ్చే చికాకులు ఉండవు.
- నెలసరి శుభ్రత విషయంలో రాజీ పడితే దీర్ఘకాలంలో అలర్జీలు మొదలుకుని క్యాన్సర్ వరకూ ఎన్నో రకాల అనారోగ్య ముప్పుల్ని ఎదుర్కోవలసి వస్తుంది. కొంతమంది తిరిగి వాడుకునే ప్యాడ్‌లు, టాంపూన్లను వాడుతుంటారు. అయితే వాటిని వాడిన ప్రతిసారి బాగా శుభ్రం చేయాలి. అలా చేసినప్పుడు మాత్రమే అందులో ఉండే హానికారక సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. లేదంటే గర్భాశయానికి ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది.
- అపరిశుభ్రంగా ఉన్న న్యాప్కిన్లు, వస్త్రాలను వాడటం వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పు ఎక్కువ. పీరియడ్స్‌లో రక్తస్రావం తక్కువగా ఉన్నా సరే.. ప్రతి 4 నుంచి 6 గంటల వ్యవధికోసారి న్యాప్‌కిన్ తప్పనిసరిగా మార్చుకోవాలి.
- పరిశుభ్రంగా ఉండటానికి న్యాప్‌కిన్స్ తరచూ మార్చుకోవడం ఎంత అవసరమో వాటిని సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయడం కూడా అంతే ముఖ్యం. బయోడిగ్రేడబుల్ రకాల్ని ఎంచుకోవాలి. వీటిలో ప్రస్తుతం ప్యాడ్లు, టాంపూన్లు, పీరియడ్ ప్యాంటీలు వంటివి చాలానే దొరుకుతున్నాయి. నచ్చిన రకాలను ఎంచుకోవచ్చు. ఇవి భూమిపై వ్యర్థాలను మిగల్చకుండా పర్యావరణ హితంగా ఉంటాయి.
- నెలసరి సమయంలో జరిగే రక్తస్రావాన్ని సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే దానివల్ల మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక న్యాప్‌కిన్ ఎక్కువ సమయం పెట్టుకోవడం వల్ల తొడల మధ్య లేదా ఆ ప్రాంతంలో ర్యాషెస్ వచ్చే అవకాశం ఉంటుంది. వీటినే 'ప్యాడ్ ర్యాషెస్' అంటారు. వీటివల్ల అలర్జీ, దురద వంటి సమస్యలు ఎదురవుతాయి. వీటికి చెక్ పెట్టాలంటే తరచూ ప్యాడ్ మార్చుకుంటూ ఆ ప్రాంతమంతా పొడిగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అవసరమైతే వైద్యులను సంప్రదించాలి.
- అలాగే ఈ సమయంలో జననాంగాన్ని శుభ్రం చేసుకోవడానికి చాలామంది సబ్బుని ఉపయోగిస్తూ ఉంటారు. కానీ ఇటువంటి సందర్భాల్లో ఆ అవయవాలు వాటంతటవే శుభ్రపడేలా మన శరీర వ్యవస్థ ఆరోగ్యకర బ్యాక్టీరియాలను విడుదల చేస్తుంది. సబ్బు ఉపయోగించడం వల్ల ఈ బ్యాక్టీరియా నశించిపోతుంది. ఫలితంగా హానికారక బ్యాక్టీరియా ఉత్పత్తయ్యే అవకాశం కూడా ఉంటుంది. అందుకే గోరువెచ్చని నీటితో పై నుంచి కింది దిశగా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.

రెండు కోట్ల ఉద్యోగాల జాడెక్కడ?

నవ తెలంగాణ- కొల్లాపూర్ రూరల్

కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు జాడ ఎక్కడని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామం బస్టాండ్ చౌరస్తాలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం భగత్ సింగ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భగత్ సింగ్ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ దశరథం నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సమైక్యత కోసం, సమాన విద్యా ఉపాధి అవకాశాల కోసం భగత్‌సింగ్ తన జీవితాన్ని బలిదానం చేశారని గుర్తుచేశారు. నేటి పాలకులు వాటిని తుంగలో తొక్కి కులమతాల పేరుతో రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగాల కల్పించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని యువత పోరాట మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి శివవర్మ యూటీఎఫ్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం తారాసింగ్, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భాస్కర్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ చంద్ర నాయక్,సేవ్య నాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లోనూ బ్రెజిల్ పరిణామాలు

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశంలోనూ ఇదే తరహా పరిణామాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. బ్రెజిల్‌లో పర్యావరణ ప్రమాదాన్ని పట్టించుకోకుండా అమెజాన్ అడవుల్లో సోయాబీన్ కమతాలను భూస్వాములు, కార్పొరేట్లకు కట్టబెట్టారనీ, దానికి తోడు ఆ అడవుల్లోని ఖనిజ సంపదకోసం మైనింగ్ ముఠాలు సిద్ధమయ్యాయనీ, దానికి అవససరమైన అనుమతులను బోల్సనారో ఇచ్చారని గుర్తుచేశారు. చర్చి పేరుతో ప్రజల్లో విభజన తెచ్చే ప్రయత్నం బోల్సనారో చేశారని చెప్పారు. ఇప్పుడు లూలాకు వ్యతిరేకంగా జరిగిన దాడులకు ఆర్థిక సహకారం అందించింది వారేననే ప్రాథమిక నిర్ధారణ ఉన్నదనీ చెప్పారు. భారతదేశం-బ్రెజిల్ ఘటనలు, అమలవుతున్న విధానాలకు భావసారూప్యత ఉన్నదని చెప్పారు. భారతదేశంలోనూ అడవులను అదానీ, అంబానీలకు కట్టబెట్టారనీ, మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారనీ, రిటైర్డ్ సైనికాధికారులను ప్రభుత్వంలో నియమించుకుంటున్నారనీ, అగ్నిపథ్ పేరుతో సైన్యాన్ని తమ కనుసన్నల్లో ఉంచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని విశ్లేషించారు. బ్రెజిల్‌లో గతంలో లూలా నేతృత్వంలోని ప్రభుత్వం అనేక సమస్యలు పరిష్కరించి, ప్రజలకు మెరుగైన జీవన విధానాన్ని అందించిందని చెప్పారు. బోల్సనారో దేశాధ్యక్షుడు అయ్యాక ఆ విధానాలను కాదని, పూర్తిగా అమెరికా కనుసన్నల్లో పనిచేశారన్నారు. కోవిడ్ టైంలో అమెరికా తర్వాత ఎక్కువ మంది మరణించింది బ్రెజిల్‌లోనేనని తెలిపారు. వైద్యరంగంలో బోల్సనారో ఎలా విఫలమయ్యారో ఇదే నిదర్శనమన్నారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రెజిల్‌ను వెనక్కి నెట్టిందనీ, బోల్సనారోను కాదని అక్కడ ప్రజలు తిరిగి లూలాకు పట్టం కట్టారని వివరించారు. బోల్సనారోకు ట్రంప్‌కు భావసారూప్యం ఉందనీ, ఇద్దరూ ఉదారవాద ఆర్థిక విధానాలతో తిరోగమన, నియంతృత్వ భావాలు కలిగిన వారేనని చెప్పారు. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా వీరి సరసన చేరారని అన్నారు. బ్రెజిల్‌లో దాడులకు ఆర్థిక వనరులు సమకూర్చిన వారినీ వదిలిపెట్టబోమని లూలా హెచ్చరించారని చెప్పారు. బ్రెజిల్ ఎన్నికల్లో సైన్యం జోక్యం చేసుకోవాలని బోల్సనారో మద్దతుదారులు అక్టోబర్ నుంచి అక్కడి కంటోన్మెంట్ ఏరియాల్లో ధర్నాలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారని వివరించారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

హైదరాబాద్‌లో వన్డే ధమాకా

(మొదటిపేజీ తరువాయి)

జరుగనున్న ఏడో వన్డే పోరు కానుంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భారత్, న్యూజిలాండ్ వన్డే మ్యాచ్‌కు ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి హెచ్‌సీఏ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. సుమారు 2500 మంది పోలీసులతో వన్డే మ్యాచ్‌కు భద్రత ఏర్పాటు చేశారు. వన్డే మ్యాచ్‌కు అందుబాటులో ఉన్న సుమారు 40 వేల టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుకావటంతో నేడు వన్డే పోరుకు స్టేడియం పూర్తిగా నిండనుంది.

రూ.12లక్షల కోట్లు అదృశ్యం!

(మొదటిపేజీ తరువాయి)

కోరుతాయి. దీనిని వాయిదాల్లో కట్టొచ్చు. రుణ పునర్‌వ్యవస్థీకరణ అనే అవకాశమూ ఇస్తుంది. అంటే మరికొంత రుణం ఇచ్చి...ఆ ఖాతాదారుడి వెసులుబాటు కల్పిస్తుంది. ఇలాంటి ఎన్నో మినహాయింపులు, అవకాశం ఇచ్చినా మనదేశంలో బడా కార్పొరేట్లు ఎగ్గొట్టిన బ్యాంకు రుణాలు రూ.12లక్షల కోట్లు దాటాయి. వీటిని చడీచప్పుడు లేకుండా 'రైట్ ఆఫ్' చేశారన్నది ప్రధాన ఆరోపణ. కేంద్రంలోని పాలకుల అండదండలు లేకుండా జరగదన్నది బహిరంగ రహస్యం.

మొత్తం రుణాల్లో ఎన్‌పీఏలు 6.5శాతం

ఎన్‌పీఏలపై ఐఎంఎఫ్-2021 నివేదిక ఆసక్తికర విషయాల్ని వెల్లడించింది. మొత్తం రుణాల్లో ఎన్‌పీఏల వాటా అమెరికా, బ్రిటన్‌లో 1శాతం. కెనడాలో 0.4శాతం. దక్షిణ కొరియాలో 0.2శాతం. చైనాలో 1.7శాతం. భారత్ విషయానికొస్తే 6.5శాతంగా ఉంది. ఇది చాలా అసహజం, ప్రమాదకరమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ దేశంలోనూ ఇంతపెద్ద మొత్తంలో ఎన్‌పీఏలు ఏర్పడటం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల మొత్తం రుణాల్లో ఎన్‌పీఏలు 9.4శాతానికి (డిసెంబర్ 29, 2022నాటికి) చేరుకుంది. యుపీఏ హయాంలో ఏటా రూ.50వేల కోట్లు లాభాలు చూసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇప్పుడు ఏటా రూ.2లక్షల కోట్ల నష్టాల్ని చవిచూడాల్సి వస్తోంది. వేల కోట్లు, లక్షల కోట్లు ఎన్‌పీఏలుగా మారటంపై బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇంతపెద్ద మొత్తం ఎక్కడి పోతుందన్నది ప్రజలకు తెలియటం లేదని, 'రైట్ ఆఫ్' ప్రక్రియ అత్యంత రహస్యంగా ముగుస్తోందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.

ఇన్ఫెక్షన్ వల్లే బాలింతల మృతి

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో దారుణాలపై ఉన్నతస్థాయి కమిటీ వేయాలి : టీడీపీ అధ్యక్షులు కాసాని

నవతెలంగాణ -హైదరాబాద్

శస్త్ర చికిత్సకు ఉపయోగించే కిట్లకు స్టైఫలో కొకస్ బ్యాక్టీరియా వ్యాపించడం వల్లే ఇటీవల మలక్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు బాలింతల మృతి చెందినట్టు విచారణ కమిటీ ప్రాథమిక నివేదికలో నిగ్గు తేలడం బీఆర్ఎస్ ప్రభుత్వ అధ్వాన్న పనితీరుకు నిదర్శనమని టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ విమర్శించారు. అదే రోజు మరో 18 మందికి డెలివరీ అయ్యాక ఇన్ఫెక్షన్ సోకడంతో వారిని మెరుగైన చికిత్స కోసం వైద్యులు నిమ్స్‌కు తరలించారనీ, ఇందులో ఇద్దరు మహిళల కిడ్నీలకు ఇన్ఫెక్షన్ సోకి దయాలిసిస్ జరుగుతున్నదని చెప్పారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆసుపత్రిలో నలుగురు బాలింతలు, పేట్ల బురుజు ఆసుపత్రిలో మరో మహిళ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సందర్భంగా ఇలాంటి ఇన్ఫెక్షన్ కారణంగా దుర్మరణం చెందినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారం అందజేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం అలసత్వాన్ని వీడి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు వెంటనే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లలో అత్యాధునిక పరికరాలను, మెరుగైన వసతులను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కోరారు.

నేడే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇటు సీఎంలు, అటు జాతీయస్థాయి నేతలు రానున్న దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 5,200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం నుంచే ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారుల వెంట పోలీసులు మోహరించారు. సభా వేదికను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. అనుమతి ఉన్న నాయకులు మినహా ఎవరినీ సభా వేదిక మీదకు ఎక్కకుండా భద్రతా చర్యలు చేపట్టారు. సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావుతో పాటు స్థానిక మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, మంత్రి మల్లారెడ్డి, లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, కౌశిక్‌రెడ్డి తదితరులు తుది ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. మరోవైపు సమీకృత కార్యాలయాల భవన సముదాయాన్ని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, మధుసూదన్ తదితరులు మంత్రులతో కలిసి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

5,200 మందితో బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు..

మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ విష్ణు ఎస్ వారియర్ ప్రకటించారు. అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్‌ఖాసీం, చంద్రశేఖర్‌రెడ్డి, వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్, డీఐజీలు రమేష్‌నాయుడు, చౌహాన్, ఖమ్మం సీపీ, మహబూబాబాద్, కొత్తగూడెం ఎస్పీలు, పది మంది అడిషనల్ ఎస్పీలు, ఏసీపీలు 39, సీపీఐలు, ఆర్ఐలు 139, ఎస్ఐలు 409 మంది ఇలా మొత్తం 5,200 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వచ్చే వాహనాలను కోదాడ మీదుగా విజయవాడ హైవేకు మళ్లిస్తున్నారు. వరంగల్ నుంచి వచ్చే వాహనాలను వరంగల్ ఎక్స్‌రోడ్ మీదుగా కోదాడ మార్గంలో తరలిస్తున్నారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. సుమారు 400 ఎకరాలను పార్కింగ్ కోసం కేటాయించారు. ఏరియాల వారీగా నంబర్లు ఇచ్చారు. మీడియా పాస్‌ల బాధ్యతను మీడియా కన్వినింగ్ కమిటీకి అప్పగించడంతో పాస్‌ల కోసం తంటాలు పడాల్సి వచ్చింది. అయినా పాస్‌లు సక్రమంగా అందకపోవడంతో పలువురు స్థానిక మీడియా ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా నిరసన వ్యక్తం చేశారు.

మధ్యప్రదేశ్‌లో ఆందోళన బాట పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

- ఫిబ్రవరి 26న భారీ నిరసన ప్రదర్శన !

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీ తీరుపై వివిధ వర్గాలు ఆందోళనకు దిగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులు శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలుజేస్తామని 2016లో సీఎం శివరాజ్ సింగ్ ప్రజలకు వాగ్దానం చేశారు. గత ఆరేండ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్నా... వాగ్దానాన్ని నిలబెట్టుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఈ అంశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమకు ఇచ్చిన వాగ్దానాన్ని బీజేపీ నెరవేర్చలేదని ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 'ఏజేజేఏకేస్' ఫిబ్రవరి 26న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది.

'ఏజేజేఏకేస్' ప్రధాన కార్యదర్శి సూర్యవంశి మాట్లాడుతూ, "లక్షలాది మంది ప్రజలు హాజరైన సభలో బహిరంగంగా సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ రిజర్వేషన్ల అమలుపై వాగ్దానం చేశారు. అన్ని రకాల నియామకాల్లో అమలుజేస్తామన్నారు. పాలనా విభాగం సైతం విధివిధానాలు సిద్ధం చేసింది. అయినా ఆరేండ్లుగా అమలు జేయకుండా అధికార బీజేపీ కాలయాపన చేస్తూ వస్తోంది. ఆరోగ్యం, ఆర్థికం, కోఆపరేటివ్, జిల్లా కోర్టులు, మెడికల్ కాలేజీలు..ఇలా అన్నిచోట్లా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ ఖాళీల్ని భర్తీ చేస్తోంది. రిజర్వేషన్లు లేకుండా ఖాళీలను నింపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ సర్కార్ కాలరాస్తోంది" అని అన్నారు. తమ డిమాండ్లపై జనవరి 29లోగా ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే, ఫిబ్రవరి 26న భోపాల్‌లో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనకు దిగుతారని మీడియాకు వెల్లడించారు.

కేటీఆర్‌కు అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఐటీ శాఖకు చెందిన అఫిషియల్ ట్విట్టర్ అకౌంట్ 22వ స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ శాఖ మంత్రిగా ఆ రంగం పురోభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కేటీఆర్...సోషల్ మీడియాలోనూ చాలా చురుగ్గా ఉంటారు.

లష్కరే తోయిబా తీవ్రవాది మక్కిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన ఐక్యరాజ్య సమితి

న్యూఢిల్లీ : నిధులను సమీకరించే, తీవ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు రూపొందించే లష్కరే తోయిబా తీవ్రవాది అబ్దుల్ రహమాన్ మక్కిని భద్రతా మండలిలోని ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా ఆంక్షల కమిటీ బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. గతేడాది జూన్, నవంబరు మధ్యలో లష్కరే, జైషే మహ్మద్ నేతలు ఐదుగురిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని భారత్, అమెరికా నుండి ప్రతిపాదనలు రాగా చైనా అడ్డగించింది. ఆ ఐదుగురిలో ఒకరే ఈ మక్కి. కాగా చైనా వైఖరిలో ఇప్పుడు మార్పు ఎందుకు వచ్చిందనే అంశంపై అధికారులు వ్యాఖ్యానించలేదు.

ఇక ప్రతి నెలా విద్యుత్ చార్జీల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

భారాలు వేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈఆర్‌సీకి ప్రతిపాదిస్తున్నాయి. డిస్కంల ప్రతిపాదనపై ఈఆర్‌సీ బహిరంగ విచారణ నిర్వహించి ట్రూఅప్ భారం వేయాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటుంది. ఈ ట్రూప్ చార్జీలు ప్రజలపై మోపేందుకు విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)ని సంప్రదించాల్సిన అవసరం కూడా లేదని పేర్కొంది. దీంతో ఇక నుంచి ప్రతి నెల వినియోగదారులకు తెలియకుండానే భారాలు పడనున్నాయి.

పిల్లలకు అమ్మమ్మ, నానమ్మల ప్రేమ ముఖ్యం : హైకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు తిరస్కరించడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మనమరాలిని వారంలో రెండు గంటల పాటు చూసేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లలిత అనుమతినిచ్చారు. అల్లుడు, అత్తల మధ్య వివాదాలు పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపకూడదని అన్నారు. అమ్మమ్మ తన మనవరాలిని వారానికోసారి కలవడానికి అనుమతివ్వాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇక్కడా అవే మార్గదర్శకాలను పాటించండి

న్యూఢిల్లీ : యూరప్‌లో అనుసరించే మార్గదర్శకాలను భారత్‌లో ఎందుకు పాటించటం లేదని సుప్రీంకోర్టు గూగుల్‌ను మంగళవారం ప్రశ్నించింది. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ఉచితంగా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేందుకు యూరప్‌లో పాటించే మార్గదర్శకాలను భారత్‌లోనూ పాటిస్తారా అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జె.బి. పార్దివాలాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ప్రతిస్పందనను తదుపరి విచారణలో తెలపాలని గూగుల్‌ను ఆదేశించింది. ఎన్‌సీఎల్‌ఏటీ నిర్ణయంపై ధర్మాసనం కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. అన్యాయమైన, పోటీకి విరుద్ధమైన పద్ధతులను అవలంభిస్తున్న గూగుల్ సంస్థపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రూ. 1,338 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతో గూగుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2016లో ఆండ్రాయిడ్ ఫోన్‌లలో యాప్‌లను ఉచితంగా ఇన్‌స్టాల్ చేసే గూగుల్ చర్య అన్యాయమని ఈయూ కమిషన్ గుర్తించిందనీ, అనంతరం ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో సూచించిందని సీసీఐ సుప్రీంకోర్టుకి తెలిపింది. అయితే భారత్‌లో మాత్రం మునుపటి మార్గదర్శకాలను కొనసాగిస్తున్నదనీ, కమిషన్ సూచించిన ఆదేశాలకు కట్టుబడేందుకు సుముఖత చూపలేదని సీసీఐ పేర్కొంది.



క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయి

నవతెలంగాణ-అశ్వాపురం

క్రీడల వలన ఉద్యోగుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ ఆటోమేటిక్ రీసెర్చ్ డైరెక్టర్ బి.వెంకట్ రామన్ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీలో గల ఉద్యోగుల నివాస కేంద్రంలో 37వ డీఏఈ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను మంగళవారం ఉత్సాహకర వాతావరణంలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని డీఏఈ కర్మాగారాల నుండి ఈ పోటీలకు హాజరైన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు స్నేహపూర్వకంగా గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ నెల 21 వరకు జరిగే ఈ పోటీలలో అజంతా, ఎల్లోరా, ద్వారక, గోల్కొండ, కోణార్క్, నాగార్జున, పుష్కర్, రామేశ్వరం జట్లు తలపడనున్నాయి. తొలిరోజు ఆతిథ్య జట్టు నాగార్జున కోణార్క్ చెట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో భార జల కర్మాగార జనరల్ మేనేజర్ కె.వి తాలే, స్పోర్ట్స్ కన్వీనర్ పీజేపీ సుధాకర్ డీజీఎంలు, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు భారీగా తరలండి

- ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఖమ్మంలో నేడు జరగనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కీలక నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశం అయ్యారు. నియోజకవర్గం నుంచి దాదాపు 7 వేలకు పైగా జనం సభకు తరలి వెళ్లనున్నట్లు చెప్పారు. ఖమ్మం సభకి వచ్చేవారు మధ్యాహ్నం రెండు గంటల లోపు సభా స్థలికి చేరుకోవాలని ఎమ్మెల్యే మెచ్చా విజ్ఞప్తి చేశారు.



అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ యడవల్లి కృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం

అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, నియోజక వర్గంలో రాజకీయ జోక్యాలతో పాత్రికేయులను ఇబ్బందలకు గురిచేస్తే సహించేది లేదని, అధికారిక జీఓ ప్రకారం ఇండ్ల స్థలాలు కేటాయించాలని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఏడవల్లి కృష్ణ డిమాండ్ మంగళవారం కొత్తగూడెం నియోజకవర్గం బస్టాండ్ సెంటర్ రైటర్ బస్తిలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది విలేకరులకు మాత్రమే రాజకీయ జోక్యంతో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు వ్యూహాలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ చోరువ తీసుకొని పారదర్శకంగా అందరికీ ఇళ్ళ స్థలాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని ఏడవల్లి కోరారు. ఈ కార్యక్రమములో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, కొత్తగూడెం పట్టణ యస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి రాజా, కాంగ్రెస్ నాయకులు వెలేటి వెంకటేశ్వర్లు, చంద్రగిరి సత్యనారాయణ, పట్టణ ఎస్టీ సెల్ నాయకులు భూక్యా శ్రీనివాస్, చుంచుపల్లి యూత్ నాయకులు శనగ లక్ష్మణ్, గడ్డిగుట్ట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ స్థలం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లివ్వాలి

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే స్థలమిచ్చి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేపట్టాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కమిటీ ఇచ్చిన పిలుపులో మండలంలో మొట్ల గూడెం, సిద్దారం గ్రామాలలో ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఇల్లందులో ప్రదర్శన ఉంటుందని, అర్హులైన పేద ప్రజలు అధిక సంఖ్యలో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగ అబ్బాయ, అప్పయ్య, మహేష్, నాగయ్య, నరేష్,లక్మ వంగా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

26న ఖాజీ కార్యాలయం ప్రారంభం

- ముస్లిం మైనార్టీలకు సేవచేసే అవకాశం దక్కింది
- జామతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్

నవతెలంగాణ-చంద్రుగొండ



ముస్లిం వివాహాలు జరిపే ఖాజీగా ముస్లిం మైనారిటీలకు సేవ చేసే అవకాశం దక్కిందని జామతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షులు యం.డి.షబ్బీర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ 2007లో గౌరవ ప్రధమైన ఖాజీ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, జీవో నెం69 ప్రకారం 31 డిసెంబర్ 2022న నియామక పత్రాన్నిముస్లిం మైనార్టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్దనకు అందజేశారన్నారు. ఈ నెల 26న స్థానికంగా ఖాజీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని అన్నారు. అనంతరం ముస్లిం యువకులు అయన్ను శాలువా తోఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు ఇబ్రహీం, సాబీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న ట్రాక్టర్లను సీజ్ చెయ్యాలి

నవతెలంగాణ-చర్ల



ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న ట్రాక్టర్లను సీజ్ చెయ్యాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లను నడుపుతున్న వారిపై కటిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మండలంలో నిబంధనలకు విరుద్ధంగా 30కు పైగా ట్రాక్టర్లు విచ్చల విడిగా తిరుగుతున్నాయని, ఇందులో సగానికి పైగా ఫిట్నెస్ లేని ట్రాక్టర్ లే వున్నాయని అన్నారు. అంతేకాకుండా ఈ ట్రాక్టర్లను డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు 18 ఏండ్లు నిండని పిల్లలు నడుపుతున్నారన్నారు. ప్రజల రక్షణను దృష్టిలో వుంచుకొని ఆర్టిఓ స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాముల సాంబ, పార్టీ నాయకులు శివ, ప్రశాంత్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు కేసీఆర్ స్పష్టత ఇవ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పోడు భూములకు హక్కులు కల్పించే విషయంలో కాలయాపన చేయకుండా నేడు ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభలోనైనా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దబండిరేవు గ్రామంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2016 నుండి పెండింగ్‌లో ఉన్న తునికి బోనస్ వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో వ్యవశాయకార్మిక సంఘం మండల అధ్యక్షులు సోయం వీర్రాజు, యాప రామారావు, దబ్బా సురేందర్, కణితి చంటి, నాగేశ్వరరావు, పూనె లక్ష్మీ, రాధ తదితరులు పాల్గొన్నారు.

19న కంటి వెలుగు కార్యక్రమం

- విలేకరుల సమావేశంలో చైర్మెన్, కమిషనర్

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వం రెండో విడత చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుశావళి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 19న ఆరో వార్డులోని మామిడి చెట్లు బడి, 19 వార్డులోని గర్ల్స్ హైస్కూల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే హరిప్రియ, హరి సింగ్ నాయక్ ప్రారంబించనున్నారని తెలిపారు. 18 ఏండ్లకు పైబడిన వారు కంటి వెలుగు వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని టేకులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల మూడుతండాలో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం... మూడు తండకు చెందిన మూడు నవీన్ (20) తన స్నేహితులతో సోమవారం మేడారం సమ్మక్క గద్దల దగ్గరకు వెళ్లి తిరిగి మంగళవారం సాయంత్రం స్వగ్రామం పైన మూడు తండకు చేరుకొని ఇంట్లో తలుపులు పెట్టుకొని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ట్లు తెలిపారు. తన సోదరుడు వెంటిలేటర్ నుండి చూడగా ఉరివేసుకున్నట్లు గుర్తించి తన కుటుంబ సభ్యులకు తెలుపగా ఇంటి తలుపులు బద్దలు కొట్టారు. చికిత్స నిమిత్తం తీసుకెళు ్తటకు ఇంటి నుండి బయటకు తీసుకురాగా మృతి చెందినట్లు రోధిస్తూ కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు సోదరులు కలరు. మృతుని తండ్రి మూడు బిచ్చు నాయక్ టేకులపల్లి గ్రామపంచాయతీ గుమస్తాగా పనిచేస్తుంటాడు.

జిల్లాలో కంటి వెలుగులు

- 19 నుంచి ప్రారంభం
- నిర్వహణకు 48 బృందాల ఏర్పాటు

నవతెలంగాణ-కొత్తగూడెం

కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 19 నుండి లాంచనంగా ప్రారంభం కానున్నది. సీఎం కేసీఆర్ ఈ నెల 18న ఖమ్మం జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో కంటి వెలుగు మొదటి విడత మంచి ఫలితాలు వచ్చాయని భావించిన ప్రభుత్వం రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుంది. జిల్లాలో 19 నుంచి పరీక్షల నిర్వహణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు సిద్ధం చేసింది. కంటివె లుగు విజయవంతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో అవగాహన ఇప్పటికే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్యాంపుల నిర్వహణకు మొత్తం 48 టీమ్లను సిద్ధంచేశారు. ఒక్కో బృందంలో 5 నుంచి ఆరుగురు వైద్య సిబ్బంది ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల పరిధిలో క్యాంపులు ఏర్పా టు చేయనున్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పూనుకుంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశం వినియోగించేకునేల చర్యలు తీసుకుంది. క్షేత్రస్థాయి గ్రామాల్లో క్యాంపుల తేదీలను చాటింపు, మైక్ ప్రచారాల ద్వారా ప్రజలకు ముందుగానే తెలియజే యాల్సిన బాధ్యత పంచాయతీలకు నిర్దేశించారు. కంటివెలుగు కార్య క్రమాన్ని సక్సెస్ చేసేందుకు జిల్లా వైద్యశాఖ ఇప్ప టికే వివిధ పీహెచ్సీల వైద్యాధికారులకు శిక్షణ ఇవ్వ డంతో పాటు తాజాగా మాక్ డ్రిల్ నిర్వహించింది. కంటి వెలుగుకు కావలసిన యంత్రాలు, కళ్లద్దాలు జిల్లాకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా 2018 ఆగస్టు 15 నుంచి 2019 మార్చి వరకు మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించింది. మొదటి విడతలో లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. ఇక రెండో విడతలో 7.90,398 మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా 48 టీమ్‌లను సిద్దంచేశారు. రూరల్ పరిధిలో 37, అర్బన్ పరిధిలో 11 టీమ్లు పని చేస్తాయి. క్యాంపునకు వచ్చే వారికి అక్కడిక్కడే కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలను గుర్తిస్తారు. తొలి విడత నిర్వహిం చిన కంటి వెలుగులో 27 టీమ్‌లు పాల్గొనగా, 333 గ్రామాలు, 82 వార్డుల్లో 2.967 వైద్య శిబి రాలను నిర్వహించి 4.91,344 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 1,70,898 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 34,262 మందిని వివిధ ఆసుపత్రులకు పంపించారు. 884 మందికి కంటి ఆపరేషన్స్ చేశారని సమాచారం.

బీజేపీని ఓడించడమే జ్యోతి బసుకిచ్చే నిజమైన నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు



భారత ప్రధాన మంత్రి పదవిని, భారతరత్నను తృణప్రాయం వదులుకున్న భారతదేశం గర్వించదగిన కమ్యూనిస్టు ముద్దుబిడ్డ కామ్రేడ్ జ్యోతిబస్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మంగళవారం అల్లే సుధాకర్ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబస్ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సభకు కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి రాజకీయాలలో ఊసరవెల్లి పాత్ర పోషిస్తూ దొడ్డి దారిన పదవులు పొందుతున్నారని విమర్శించారు. నేటి యువతరానికి జ్యోతిబసు జీవిత చరిత్ర ఆదర్శమన్నారు. భారతదేశంలోని ముఖ్యమంత్రి పదవిని కూడా వదులుకొని కామ్రేడ్ బుద్ధా దేవ్ భట్టాచార్యకు అవకాశం ఇచ్చారన్నారు. భూసంస్కరణలు చేసి 14 లక్షల ఎకరాల భూములను పంచిన ఘనత జ్యోతిబసుదే అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ చేతుల్లో కీలుబొమ్మగా మారిందన్నారు. రాజ్యాంగాన్ని అమలు కాకుండా చేసేందుకు విధ్వంసాలు చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కోడిశాల రాములు, నాయకులు ఉప్పతల నరసింహారావు, బొల్లం రాజు, మాచారపు లక్ష్మణరావు, తోట పద్మ, నంద ఈశ్వరరావు, అల్లే సుధాకర్, రమేష్, ములకల ఉత్తమ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజకీయాలలో విలువలకు నిలువెత్తు నిదర్శనం జ్యోతిబసు : మచ్చా

కొత్తగూడెం : రాజకీయాలలో విలువలకు నిలువెత్తు నిదర్శనం జ్యోతిబసు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మంచికంటి భవన్‌లో మంగళవారం అమరజీవి కామ్రేడ్ జ్యోతిబసు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఏర్పాటులో మొదటి పొలిట్ బ్యూరో సభ్యులుగా కమ్యునిస్టు ఉద్యమ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యుడు జ్యోతిబసు అని అన్నారు. ప్రధాన మంత్రిగా పోటీ చేసే అవకాశం వచ్చినప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఆ పదవిని వద్దు అనుకున్నాడని కొనియాడారు. జ్యోతిబసు జీవితం నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ నాయకులు డి.వీరన్న, నందిపాటి రమేష్, అలీ, విజయమోహన్ సింగ్ తదతరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాని లేఖ
- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యంకి, రాష్ట్ర ప్రభుత్వాని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు లేఖ రాశారు. లేఖలో పొందు పరిచిన వివరాలు మంగళవారం రాష్ట్ర మంత్రి ఆర్థిక శాఖమంత్రి హరీష్‌రావుకు అందజేసిన వివరాలు మీడియాకు వెల్లడించారు. "బిజేపికి హఠావో... సింగరేణికి బచావో" అని సింగరేణి పుట్టినిల్లు ఇల్లందు నుండి మీరు ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమరు కృషి చేయాలని కోరారు. తెలంగాణలో అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి, సింగరేణిలోని అన్ని విభాగాలలో సుమారు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, బొగ్గు ఉత్పత్తిలో, సింగరేణి సాధిస్తున్న లాభాలలో, సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, తెలంగాణ సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాలను కోల్పోయి కూడా పాల్గొన్నారని వివరించారు. కోల్ ఇండియాలో కాంట్రాక్ట్ కార్మికుడికి రోజుకి రూ.1007లు చెల్లిస్తూంటే సింగరేణిలో రూ.477లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడు నెలకు సుమారు రూ.13780లు నష్టపోతున్నారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లిస్తుంటే సింగరేణిలో ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్నారు. ఇతర సమస్యలు సానుభూతితో పరిశీలించి పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

డిమాండ్స్ : సింగరేణిలోని అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు మున్సిపాల్టీలో చెల్లిస్తున్న విధంగా నేరుగా వేతనాలు చెల్లించాలని, (దీని సింగరేణికి నెలకు సమారు రూ.50 లక్షలు ఆదా అవుతుంది.) కోల్ ఇండియా వేతనం అమలు చేయాలని, తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ జీఓ నెం. 6000 లేదా జీఓ నెం. 22 ప్రకారం వేతనాలు అమలు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని, జీఓ నెం.22 అమలుకోసం సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి వ్రాసిన లేఖపై స్పందించాలని, ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో చెల్లించిన విధంగా రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇటీవల సింగరేణిలో లాభాల వాటా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా చెల్లించాలి. లేదా 20 శాతం బోనస్ చెల్లించాలి. సింగరేణి హస్పిటల్స్ కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, లేదా ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, లేబర్ అధికారుల సమక్షంలో సింగరేణి అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఖాళీ క్వార్టర్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, క్యాటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లించాలి.పెండింగ్‌లో ఉన్న అన్ని విభాగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



రెడ్డిలందరూ ఐక్యంగా ఉండాలి

- రాష్ట రెడ్డి జాగృతి అధ్యక్షులు పిట్టా శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-మణుగూరు

రెడ్డిలందరూ ఐక్యంగా ఉండాలని రాష్ట్ర రెడ్డి జాగృతి అధ్యక్షులు పిట్టా శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మణుగూరు శ్రీ భార్గవ ఆటో మొబైల్స్ హీరో షోరూం ఆవరణంలో రెడ్డి సమాఖ్య నాయకులు కలిసి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ సాధించామన్నారు. అదే విధంగా రెడ్డి కార్పొరేషన్‌ను కూడా సాధించుకుందామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా రెడ్డిలు ముందుండాలన్నారు. అనంతరం రెడ్డి సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర రెడ్డి జాగృతి అధ్యక్షులు పిట్టా శ్రీనివాసరెడ్డి, అమ్మ న్యూస్ ఛానెల్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, సినీ నిర్మాత మందాడి అరవిందరెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, గుర్రం వెంకటరెడ్డి,ఎస్. వెంకటేశ్వరరెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్), యూటి రెడ్డి, సరెడ్డి రాఘవరెడ్డి, అశోక్ రెడ్డి, మౌనిక వెంకటరెడ్డి, సురేందర్ రెడ్డి, అవినాష్ రెడ్డి, శ్యామల రామిరెడ్డి, శ్రీలత రెడ్డి, బంకు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సతీష్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ కప్ విజేత బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టు

- క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి : జడ్పీటీసీ

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో మిత్రుని జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్న సతీష్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బూర్గంపాడు బబ్బు ఎలెవన్-ఎస్ఆర్‌పీ ఎలెవన్ జట్లు తలపడ్డాయి. టాస్ ఓడి మొదటిగా బ్యాటింగ్ చేసిన బబ్బు ఎలెవన్ జట్టు 11.1 ఓవర్లలో 65 పరుగులు చేసి అలౌట్ అయింది. అనంతరం 66 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్ఆర్‌పీ ఎలెవన్ జట్టు నిర్ణిత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 56 పరుగులు చేసి ఓటమి పాలైంది. బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టులో 4 పరుగు లిచ్చి 3 వికెట్లు తీసిన కార్తిక్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రూ.18,000 నగదుతో పాటు విజేతగా నిలిచిన బూర్గంపాడు బబ్బు ఎలెవన్ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. అదేవిధంగా ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్ఆర్‌పీ ఎలెవన్ జట్టుకు రూ.12,000 నగదుతో పాటు రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రన్నర్స్ ట్రోఫీని అందజేశారు.

ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడ తాయని ఆమె అన్నారు. తామ మిత్రుడు సతీష్ రెడ్డి జ్ఞాపకార్థంగా రెండవ సారి నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ విజయ వంతం కావటం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లో కొనసాగించాలని ఆమె అన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆవుల నాగార్జున రెడ్డి, పాలం దివాకర్ రెడ్డి, బాదం గణేష్ రెడ్డి, యారం పున్నారెడ్డి, దుగ్గు శ్రీనివాస రెడ్డి, దుగ్గు రాజశేఖర్ రెడ్డి, ఉమ్మల రెడ్డి బాలశేకర్ రెడ్డి, చాగర్లమూడి జగదీష్, పేరం సంజీవ రెడ్డి, పోతిరెడ్డి విష్ణు వర్ధన్ రెడ్డి, యారం పూర్ణ చందర్ రెడ్డి, లోకిరెడ్డి వెంకటస్వాతిక్ రెడ్డి పడిదెల శ్రీను, బందెల శ్రీను, పాలం ప్రకాష్ రెడ్డి, బాదం రామ కృష్ణ రెడ్డి, చింతా వెంక ట్రామిరెడ్డి, బిజ్జం అంజిరెడ్డి, పాశం వెంకట్రామిరెడ్డి, బాదం వెంకటేశ్వర రెడ్డి, పోతిరెడ్డి తిరుపతి రెడ్డి, ఆలేటి వెంకటేష్, మడకం గణేష్, జక్క కార్తిక్, బందెల సాయి పవన్, కటుకురి విక్రమ్, బొడ్డు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం సన్నాక సమావేశం

నవతెలంగాణ-దమ్మపేట

ఈ నెల 20వ తేదీన దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలోని నమిలిపేటలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమావేశానికి సన్నాహక కమిటీలను మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి అభిమానులు జారే ఆదినారాయణ, కోటగిరి సత్యంబాబు రావు, గంగాధరరావు, నాయుడు శ్రీను, ఎర్ర గొర్ల రాధాకృష్ణ, ప్రమోద్, చిన్న శెట్టి యుగంధర్, చామర్తి గోపి శాస్త్రి రావు, రవి శంకర్, చక్కిరాల మల్లేశ్వరరావు, వీరయ్య, నర్సి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్ రాజు

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో ఏడు మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్డిఏ పీడీ మధుసూదన్ రాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇల్లందు, టేకులపల్లి చంద్రుగొండ మండలాల్లో తేజ మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి యశస్విని, తేజస్విని 22-22 రెడ్ హార్ట్ మిర్చిని కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. లిపిడ్స్ కంపెనీ కురవి మహబూబాద్ జిల్లా వారికి అవగాహన ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. అందులో భాగంగానే ఆరు జిల్లాల్లో ఈ సంవత్సరం ఉన్నత అధికారులు ఆదేశ ప్రకారం మిర్చిని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్లాంట్ లిపిడ్స్ కంపెనీ కురవి మహబూబాద్ ఆధ్వర్యంలో మహిళా రైతు ఉత్పత్తిదారులు కంపెనీ లిమిటెడ్ ద్వారా ఇల్లందు, టేకులపల్లి, చంద్రుగొండ మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఫిబ్రవరి మాసం మొదటి వారం నుండి కొనుగోలు చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. మొత్తం 46 గ్రామాల్లో ఏడు కేంద్రాలను 939 మిర్చి రైతుల దగ్గర 144.5 ఎకరాల్లో సాగు చేసిన 2157 నాలుగు క్వింటాళ్ల దిగుబడి అంచనా ఉందని చెప్పారు. దీనివల్ల రైతు నుంచి మిర్చిని కొనుగోలు చేసిన తర్వాత ఏడు రోజుల లోపు రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు చేపడుతుందని రైతుకు రవాణా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. రైతు ఎవరికి ఇలాంటి కమిషన్ లేదా సర్వీస్ ఛార్జీలు చెల్లించవలసిన అవసరం ఉండదు అని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దళిత టీచర్ మల్లికార్జున్‌పై దాడి చేసిన మతోన్మాదులను శిక్షించాలి

- జేసీకి వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



నిజామబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జునను కులం పేరుతో దూషిస్తూ బలవంతంగా దేవుడు గుడికి తీసుకెళ్ళి బొట్టు పెట్టించి, అతన్ని అవమానిస్తూ, గ్రామ విధుల్లో ఊరేగించి, అనాగరిక చర్యలకు పాల్పడిన ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద దుండగులు చేసిన దుశ్చర్యలను సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. దళితుడైన మల్లికార్జున్ టీచర్‌ను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎట్రాసిటీ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 17న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు నిర్వహించి, సామూహిక రాయబారాలు జరిపి కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి మాట్లాడారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, డి. వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రాములు, అంకిరెడ్డి, శ్యామ్ వెంకన్న పాల్గొన్నారు.



సొంతగడ్డపై భారత్ గర్జించే పులి. ఇది టెస్టు క్రికెట్‌కు మాత్రమే పరిమితం కాదు. వన్డే ఫార్మాట్‌లోనూ టీమ్ ఇండియా అదే దూకుడు చూపిస్తుంది. 2010 ఆరంభం నుంచి భారత్ స్వదేశంలో 25 ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడగా, ఏకంగా 22 సిరీస్‌లు సొంతం చేసుకుంది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఏడాదిలో ఈ రికార్డుకు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మిషన్ వరల్డ్‌కప్ దిశగా సాగుతున్న టీమ్ ఇండియా కొత్త ఏడాదిని 3-0 క్లీన్‌స్వీప్‌తో మొదలెట్టింది. వన్డే క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద విజయంతో ఊపుమీదున్న రోహిత్‌సేన.. నేడు న్యూజిలాండ్ సవాల్‌కు సిద్ధం కానుంది. హైదరాబాద్ వేదికగా భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే నేడు.

ఇక కివీస్ సవాల్

- సొంతగడ్డపై భారత్‌కు మరో పరీక్ష
- హైదరాబాద్‌లో తొలి వన్డే నేడు

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-హైదరాబాద్

ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్ ఏడాదిలో భారత్ మరో పరీక్ష ఎదుర్కొనుంది. శ్రీలంకను చిత్తుగా ఓడించి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన భారత్‌కు హైదరాబాద్ కాస్త కఠిన సవాల్ ఎదురు కానుంది. స్వదేశంలో ఎదురులేని రికార్డులున్న భారత్‌పై 2016, 2017 వన్డే సిరీస్‌లను నిర్ణయాత్మక మ్యాచ్ వరకూ తీసుకెళ్లిన న్యూజిలాండ్.. ఇటీవల పాకిస్థాన్‌పై 2-1 వన్డే సిరీస్ విజయంతో భారత్‌లో అడుగుపెట్టింది. ఇటు భారత్, అటు న్యూజిలాండ్ తాజా విజయాల జోరు మీదున్నాయి. ఐసీసీ వరల్డ్ నం.1 వన్డే జట్టు న్యూజిలాండ్‌ను ఎదుర్కొనేందుకు ఐసీసీ వరల్డ్ నం.2 వన్డే జట్టు భారత్ రంగం సిద్ధం చేసుకుంది. సొంతగడ్డపై భారత్ విసిరే పంజాను న్యూజిలాండ్ తట్టుకోగలదా? చూడాలి.


మెరిసేందుకు ఓ అవకాశం! :

భారత్ ఇటీవల రెండు భారీ విజయాలు సాధించింది. శ్రీలంకపై తొలుత బ్యాటింగ్ చేసిన రెండు మ్యాచుల్లోనూ వరుసగా 373, 390 పరుగుల భారీ స్కోర్లు నమోదు చేసింది. ఈ రెండు సందర్భాల్లోనూ సూపర్‌స్టార్ విరాట్ కోహ్లి శతక మోత మోగించాడు. వ్యక్తిగత కారణాల రీత్యా కెఎల్ రాహుల్, అక్షర్ పటేల్ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు దూరంగా ఉన్నారు. దీంతో ఈ ఇద్దరి స్థానంలో తుది జట్టులోకి రానున్న క్రికెటర్లు అవకాశం సద్వినియోగం చేసుకునే పనిలో ఉన్నారు. 2023 వరల్డ్‌కప్‌కు రోహిత్ శర్మకు తోడుగా శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్ చేస్తాడని జట్టు మేనేజ్‌మెంట్ ఓ స్పష్టతతో ఉంది. దీంతో ఆడిన చివరి వన్డేల్లో ద్విశతకం సాధించిన ఇషాన్ కిషన్ బెంచ్‌పై కూర్చున్నాడు. కెఎల్ రాహుల్ స్థానంలో కిషన్ నేడు తుది జట్టులోకి రానున్నాడు. వికెట్ కీపింగ్‌తో పాటు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ అవకాశం దక్కించుకోనున్నాడు. వన్డే తుది జట్టులో చోటు కోసం మెగా ట్రయల్‌తో పాటు ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు ప్రథమ ప్రాధాన్య వికెట్ కీపర్‌గా నిలిచేందుకు కిషన్ ఆట సాగనుంది. అక్షర్ పటేల్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తుది జట్టులోకి రానున్నాడు. బెంచ్‌కు పరిమితమైన వాషింగ్టన్ సుందర్ కివీస్‌పై సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నాడు. ఇక శ్రేయస్ అయ్యర్‌కు గాయం కావటంతో అనూహ్యంగా వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో టీ20 మొనగాడు సూర్యకుమార్ యాదవ్ తుది జట్టులోకి రావటం లాంఛనమే. 50 ఓవర్ల ఫార్మాట్‌లో తనదైన శైలి చూపించేందుకు సూర్యకుమార్ సిద్ధంగానే ఉన్నాడు. టాప్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్ ఫామ్‌లోకి రాగా.. కెప్టెన్ రోహిత్ శర్మ తనదైన ఇన్నింగ్స్ బాకీ పడ్డాడు. కివీస్‌పై వన్డేల్లో నాయకుడు ఫామ్‌లోకి వస్తే భారత్‌కు ఇక పరుగుల పండగే. బౌలింగ్ విభాగంలో భారత్ ముగ్గురు పేసర్లకు తోడు హార్దిక్ పాండ్యను బరిలోకి దింపనుంది. స్పిన్ పిచ్‌పై వాషింగ్టన్ సుందర్‌కు తోడు కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్‌లలో ఒకరు లేదా ఇద్దరూ బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమిలతో కలిసి యువ స్పీడ్‌గన్ ఉమ్రాన్ మాలిక్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు. లోకల్ హీరో మహ్మద్ సిరాజ్‌పై తొలి వన్డేలో ప్రత్యేక ఫోకస్ ఉండనుంది.

కివీస్ నిలిచేనా?! : వైట్‌బాల్ ఫార్మాట్‌లో న్యూజిలాండ్ ఎప్పుడూ బలమైన జట్టే. కానీ కెప్టెన్ కేన్ విలియమ్సన్, స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌథీలు లేకుండానే ఆ జట్టు భారత్‌లో అడుగుపెట్టింది. గాయంతో ఇశ్ సోధి తొలి వన్డేకు దూరమయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ తీవ్ర జ్వరం నుంచి కోలుకోవటం పర్యాటక జట్టు శిబిరంలో కాస్త ఊరట. బ్యాటింగ్ విభాగంలో కేన్ విలియమ్సన్, బౌలింగ్ విభాగంలో బౌల్ట్, సౌథీ స్థానాలు భర్తీ చేయటమే కివీస్‌కు అసలు సమస్య. భారత్‌ను సొంతగడ్డపై ఇరకాటంలో పడేయటం కివీస్‌కు బాగా తెలుసు. ఉపఖండ పరిస్థితుల్లోనూ భారత్‌పై విజయం సాధించవచ్చని ఇటీవల బంగ్లాదేశ్ నిరూపించింది. ఎటాకింగ్ స్పిన్ దళంతో భారత్‌పై పైచేయి సాధించవచ్చని న్యూజిలాండ్‌కు తెలుసు. కానీ హైదరాబాద్ వన్డేలో ఆ జట్టు ముగ్గురు స్పిన్నర్లను బరిలోకి దింపలేని స్థితి. ఇశ్ సోధి మోకాలి గాయానికి గురవటంతో ఇద్దరు స్పిన్నర్లతోనే ఆడనుంది.

ఇక కెప్టెన్ టామ్ లేథమ్ న్యూజిలాండ్‌కు అతిపెద్ద బలం. భారత్‌పై టామ్ లేథమ్‌కు మంచి రికార్డుంది. భారత్‌పై 17 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 65.07 సగటుతో, 98.93 స్ట్రయికరేట్‌తో లేథమ్ పరుగులు పిండుకున్నాడు. భారత్‌పై చివరగా ఆడిన వన్డేలోనూ 104 బంతుల్లో అజేయంగా 145 పరుగులు సాధించాడు. ఆ ఫామ్‌ను కొనసాగించాలని లేథమ్ భావిస్తున్నాడు. విలియమ్సన్ లేని వేళ లేథమ్ బ్యాటింగ్ విభాగంలో మరింత బాధ్యత తీసుకోవాల్సి ఉంది. ఇతర బ్యాటర్లకు భారత్‌లో ఆడిన అనుభవం లేదు. ఇది ఆ జట్టుకు ప్రతికూలం. కానీ ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్, మార్క్ చాప్‌మన్, డార్లీ మిచెల్ ప్రతిభావంతులు. గ్లెన్ ఫిలిప్స్ ప్రమాదకర ఆటగాడు. పాకిస్థాన్‌పై ఆడిన అనుభవంతో భారత్‌లోనూ మెరిసేందుకు ఎదురుచూస్తున్నారు. బౌలింగ్ విభాగంలో లాకీ ఫెర్గుసన్ కివీస్‌ను నడిపించనున్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ముంగిట భారత్‌తో సిరీస్‌లో ఫలితంతో సంబంధం లేకుండా విలువైన అనుభవం గడించటంపైనే న్యూజిలాండ్ ఎక్కువగా దృష్టి సారించినట్టు కనిపిస్తోంది!.

పిచ్, వాతావరణం : రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఇప్పటివరకు ఆరు వన్డేలు జరిగాయి. గణాంకాల ప్రకారం ఆ ఆరు వన్డేల్లోనూ స్పిన్నర్లు చక్రం తిప్పారు. చివరగా 2019లో ఆస్ట్రేలియాతో వన్డేలోనూ భారత స్పిన్నర్లు కుల్దీప్, జడేజా, కేదార్‌లు మెరవటంతో కంగారూలు స్వల్ప స్కోరుకే పరిమితం అయ్యారు. ఇక్కడ స్పిన్నర్ల సగటు 38.70, ఎకానమీ 4.96. పేసర్ల సగటు 40.84 కాగా ఎకానమీ 5.74గా ఉంది. నేడు భారత్, న్యూజిలాండ్ వన్డేలోనూ స్పిన్ కీలక పాత్ర పోషించనుంది. తొలి వన్డేకు వాతావరణం అనుకూలంగా ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు 31 డిగ్రీల సెల్సియస్ ఉండనుంగా.. రెండో ఇన్నింగ్స్ సమయానికి ఆహ్లాదకరంగా ఉండనుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు మొగ్గుచూపవచ్చు.



తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్/ యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్.

న్యూజిలాండ్ : ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, మార్క్ చాప్‌మాన్/హెన్రీ నికోల్స్, డార్లీ మిచెల్, టామ్ లేథమ్ (కెప్టెన్, వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్, హెన్రీ సిప్లే, జాకబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గుసన్.

వన్డేల్లో వేగంగా వెయ్యి పరుగులు సాధించిన భారత బ్యాటర్లుగా కోహ్లి, ధావన్ సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. 1000 పరుగులకు ఆ ఇద్దరు 24 ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆ రికార్డును తిరగరాసేందుకు శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఉంది. 18 ఇన్నింగ్స్‌ల్లో గిల్ 894 పరుగులు చేశాడు. మరో 106 పరుగులు సాధిస్తే గిల్ ఈ ఘనత దక్కించుకోనున్నాడు.

2022 ఆరంభం నుంచి ఐసీసీ శాశ్వత సభ్య దేశాల బౌలర్లలో అత్యధిక వికెట్లు కూల్చిన బౌలర్‌గా హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ కొనసాగుతున్నాడు. ఈ సమయంలో సిరాజ్ 19.87 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు. నేడు సొంతగడ్డపై సిరాజ్ మరో మెరుపు ప్రదర్శనపై కన్నేశాడు.

అయ్యర్ అవుట్



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ దూరమయ్యాడు. తిరువనంతపురంలో శ్రీలంకతో మూడో వన్డేలో శ్రేయస్ అయ్యర్ వెన్నుపూస గాయానికి గురయ్యాడు. నొప్పి ఉందంటూ శ్రేయస్ జట్టు ఫిజియోకు ఫిర్యాదు చేయగా.. తదుపరి పరీక్షలు, చికిత్స, రిహాబిలిటేషన్ నిమిత్తం శ్రేయస్ అయ్యర్‌ను బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు పంపించారు. శ్రేయస్ అయ్యర్ స్థానంలో ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన రజత్ పటీదార్‌ను బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది.

సింధు పరాజయం

- ఇండియా ఓపెన్ సిరీస్



న్యూఢిల్లీ : భారత స్టార్ షట్లర్ పి.వి సింధు ఇండియా ఓపెన్ నుంచి నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో 14-21, 20-22తో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిద చేతిలో పరాజయం పాలైంది. వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ 21-17, 12-21, 21-19తో డెన్మార్క్ అమ్మాయి బ్లిచ్‌ఫెడ్‌పై గెలుపొం దింది. మెన్స్ సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ 21-14, 21-15తో వరుస గేముల్లో సహచర షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్‌పై గెలు పొందాడు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ 21-13, 21-15తో స్కాట్లాండ్ జోడీపై వరుస గేముల్లో విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో శృతి మిశ్రా, సిక్కి రెడ్డి జంట 17-21, 19-21తో తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది.

జకోవిచ్ శుభారంభం

- ఆస్ట్రేలియన్ ఓపెన్ 2023



మెల్‌బోర్న్ : తొమ్మిదిస్లారు చాంపియన్ నొవాక్ జకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశాడు. గత ఏడాది హైడ్రామా అనంతరం ఆస్ట్రేలియా ఓపెన్‌లో తొలిసారి ఆడుతున్న జకోవిచ్ మెన్స్ సింగిల్స్‌లో తొలి రౌండ్లో స్పెయిన్ ఆటగాడిపై వరుస సెట్లలో అలవోక విజయం నమోదు చేశాడు. 6-3, 6-4, 6-0తో రాబర్లో కార్బెల్లాస్ బేనా (స్పెయిన్)ను చిత్తుగా ఓడించాడు. తొలి రెండు సెట్లలో ప్రత్యర్థికి గేములు కోల్పోయినా.. చివరి సెట్‌లో ఏకపక్ష విజయం నమోదు చేశాడు. బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే ఓటమి నుంచి గట్టెక్కాడు. ఇటలీ ఆటగాడు బెరాటినిపై తొలి రెండు సెట్లను 6-3, 6-3తో నెగ్గిన ముర్రే.. తర్వాతి రెండు సెట్లను 4-6, 6-7(7-9)తో చేజార్చుకున్నాడు. నిర్ణయాత్మక ఐదో సెట్‌ను 7-6(10-6)తో టైబ్రేకర్‌లో గెలుపొందిన ముర్రే తర్వాతి రౌండ్‌కు చేరుకున్నాడు. మెల్‌బోర్న్‌లో వేడి గాలుల కారణంగా మంగళవారం జరగాల్సిన చాలా మ్యాచులు మధ్యలో నిలిచిపోగా, మరికొన్ని మ్యాచులను రీ షెడ్యూల్ చేశారు.

హైదరాబాద్ తడబాటు

- మహారాష్ట్రతో రంజీ మ్యాచ్



పుణె : రంజీ ట్రోఫీలో హైదరాబాద్ చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మహారాష్ట్రతో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ వెనుకంజలో కొనసాగుతోంది. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. నౌషద్ షేక్ (145 నాటౌట్) అజేయ శతకంతో మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి 353/5 పరుగుల వద్ద నిలిచింది. ఆశయ్ పాల్కర్ (61 నాటౌట్) అజేయంగా ఆడుతు న్నాడు. హైదరాబాద్ బౌలర్లలో కార్తికేయ మూడు, రవితేజ రెండు వికెట్లు పడగొట్టారు.

భారీ కోల్‌కతా సెట్‌లో భోళాశంకర్



చిరంజీవి

చిరంజీవి కథానాయకుడిగా, మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోలా శంకర్' షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో పునఃప్రారంభమైంది. రామబ్రహ్మం సుంకర భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను భారీ కోల్‌కతా సెట్‌లో మేకర్స్ ఆరంభించారు.

'వాల్తేరు వీరయ్య'తో చిరంజీవి భారీ బ్లాక్ బస్టర్ సాధించడంతో 'భోళా శంకర్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవిని స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో దర్శకుడు మెహర్ రమేష్ ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి సోదరిగా కీర్తి సురేష్ నటిస్తుండగా, తమన్నా కథానాయికగా కనిపించనుంది.

రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మి గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మెహర్ రమేష్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి, సంగీతం: మహతి స్వర సాగర్, డీవోపీ: డడ్లీ, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, కథా పర్యవేక్షణ: సత్యానంద్, డైలాగ్స్: తిరుపతి మామిడాల, ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్, లిరిక్స్: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, శ్రీమణి, సిరాశ్రీ.

ఆడ ఉంది నీవే.. ఈడ ఉంది నీవే



ధనుష్

నిర్మాత సూర్యదేవర నాగవంశీ నేతృత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కోలీవుడ్ అగ్ర నటుడు ధనుష్‌తో జతకడుతూ 'సార్' చిత్రాన్ని శ్రీమతి సాయి సౌజన్య (ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థ)తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ చిత్ర నిర్మాణ సంస్థ ఈ చిత్రానికి సమర్పకునిగా వ్యవహరిస్తోంది. ఇందులో ధనుష్‌తో సంయుక్త మీనన్ జోడీ కడుతున్నారు.

వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళంలో నిర్మిస్తున్న ఈ ద్విభాషా చిత్రం 'సార్'(తెలుగు) 'వాతి' (తమిళం) నిర్మాణ కార్యక్రమాలు ముగింపు దశలో ఉన్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన 'బంజారా' అనే పాటను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. 'ఆడ ఉంది నీవే ఈడ ఉంది నీవే, నీది కానీ చోటే లేనేలేదు బంజారా..' అంటూ సుద్దాల అశోక్‌తేజ అందించిన అద్భుతమైన సాహిత్యానికి అంతే అద్భుతమైన జీవి ప్రకాష్ సంగీతం, అనురాగ్ కులకర్ణి స్వరం తోడై పాటను మరో స్థాయికి తీసుకెళ్లాయి. అలాగే సంగీతానికి తగ్గట్లుగా నృత్య దర్శకుడు విజయ్ బిన్ని అందించిన స్టెప్పులు అందర్నీ అలరిస్తున్నాయి.

'జీవితం వెనుక ఉన్న వేదాంతాన్ని, జనన మరణాల మధ్య ఉన్న బతుకు బాట, దాని పరమార్థాన్ని చిత్ర కథానుసారం చెప్పే ప్రయత్నం చేశాం. భగవంతుడు మనకు ఏమీ చేయట్లేదని అనుకోవద్దు. నీకోసం ఒక స్థానం పెట్టాడు. అక్కడికి చేరుకోవటం నీ బాధ్యత అని చెప్పే పాట ఇది. బతుకు ప్రయాణం గురించి పాట కావాలని, చిత్ర కథ, సందర్భం దర్శకుడు చెప్పిన తీరు నచ్చింది. ఆది శంకర తత్వాన్ని, భగవద్గీత సారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ గీతానికి సాహిత్యం అందించటం జరిగింది' అని గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తెలిపారు.

విద్యావ్యవస్థ తీరుపై కథానాయకుడు చేసే పోరాటం నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఫిబ్రవరి 17న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

నవచిత్రం

అందరూ మహానుభావులు కాలేరు



కె.వి.రమణ , బాలకృష్ణ, వకులా భరణం కృష్ణమోహన్‌రావు

'భూమ్మీద ఎందరో పుడతారు, గిడతారు కానీ అందరూ మహానుభావులు కాలేరు. తమ స్వశక్తితో అత్యున్నస్థితికి వెళ్లాలంటే అకుంఠిత దీక్ష కావాలి నిరంతర ప్రయత్నం జరగాలి. అలాంటి వారిలో శిఖర సమానులు ఎల్వీ ప్రసాద్ గారు' అని హీరో బాలకష్ణ అన్నారు.

మంగళవారం ప్రసాద్ లాబ్స్‌లో ఆకృతి ఆధ్వర్యంలో ఎల్‌వి ప్రసాద్116వ జయంతి, ఆకృతి- ఎల్‌వి ప్రసాద్ పురస్కార ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా పురస్కారం స్వీకరించిన బాలకృష్ణ భావోద్వేగంతో ప్రసంగించారు. 'నాన్న గారితో ప్రసాద్ గారి అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఆయనలోని ప్రతిభను మొదట గుర్తించింది ఎల్‌వి ప్రసాద్ గారు. అందుకే 'మనదేశం'లో వేషం ఇచ్చి 'పల్లెటూరి పిల్ల'లో హీరోని చేశారు. అంతే ఇక నాన్న వెనుదిరిగి చూసుకోలేదు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా. కె. వి. రమణ పురస్కారం ప్రదానం చేసి ప్రసంగించారు. మరో విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బి. సి. కమిషన్ చైర్మన్ డా. వకులా భరణం కృష్ణ మోహన్ రావు ప్రసంగిస్తూ మూడు భాషల తెలుగు టాకీలో నటించిన ప్రసాద్ గారు చిరస్మరణీయులు అన్నారు. సీల్ వెల్ కార్పొరేషన్ చైర్మన్ బండారు సుబ్బారావు సభకు అధ్యక్షత వహించగా, ఆకృతి సుధాకర్ సమన్వయ బాధ్యతలు నిర్వహించారు.

హాలీవుడ్ రేంజ్‌లో ఏ మాస్టర్ పీస్

'శుక్ర', 'మాటరాని మౌనమిది' చిత్రాలతో ప్రతిభ గల దర్శకుడిగా పేరు తెచ్చుతున్న సుకు పూర్వాజ్ తాజాగా తన మూడో సినిమా 'ఏ మాస్టర్ పీస్'కు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. సూపర్ హీరో బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్నారు.

మంగళవారం ఈ సినిమా హీరో సూపర్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసారి దర్శకుడు ఈ సినిమా ను హాలీవుడ్ రేంజ్‌లో సరికొత్త కంటెంట్, ప్రెజెంటేషన్‌తో రూపొందించనున్నట్టు పోస్టర్ చూస్తే తెలుస్తోంది.

తమ సూపర్ హీరో ఎలా ఉండబోతున్నాడో, తను ఈ సినిమాని ఎలా చూపించబోతున్నాడో ఒక్క పోస్టర్‌తో చెప్పాడు దర్శకుడు. పిల్లలకు ఎంతో ఇష్టమైన సూపర్ హీరోను మన తెలుగు ప్రేక్షకులకు కూడ పరిచయం చేస్తూ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా చిత్రీకరించ బోతున్నాం అంటూ దర్శకుడు తెలిపారు.

మల్లిక.. ఓ మల్లిక



సమంత

సమంత ప్రధాన పాత్రధారిగా గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'శాకుంతలం'. దిల్‌రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రం నుంచి నేడు (బుధవారం) 'మల్లిక..ఓ మల్లిక..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 17న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

అగ్ని నేపథ్యంలో అవతార్ 3



జేమ్స్ కామెరూన్

'అవతార్', 'అవతార్ 2' (ది వే ఆఫ్ వాటర్) ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కలెక్షన్ల సునామీని సృష్టించాయి. అంతేకాకుండా విజువల్ వండర్స్‌గా పిల్లల దగ్గర్నుంచి పెద్దల వరకు అమితంగా ఆకట్టుకున్నాయి. అయితే ఈ నేపథ్యంలో వీటికి సీక్వెల్‌గా రాబోయే 'అవతార్ 3' ఎలా ఉంటుంది? అనే ప్రశ్నకి సమాధానం కోసం సినీ ప్రేమికులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే ఆ ఆతృతకి చెక్ పెడుతూ దర్శక దిగ్గజం జేమ్స్ కామెరూన్ 'అవతార్ 3' ఎలా ఉండబోతోందో చెప్పారు.

'అవతార్ 2' ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ప్రతిష్టాత్మక క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుని దక్కించుకుంది. ఈ అవార్డుల వేడుకపై జేమ్స్ కామెరూన్ తన తదుపరి సినిమా 'అవతార్ 3' గురించి మాట్లాడుతూ, అగ్ని ప్రధానంగా మూడో భాగం ఉంటుందని చెప్పారు. 'అగ్ని ఒక చిహ్నం.. ప్రయోజనకారి. మూడో భాగంలో ఇదే ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. సంస్కృతి మిళితమై కాన్సెప్ట్ సాగుతుంది. దీంతోపాటు మరో రెండు సంస్కృతులు కూడా మీకు పరిచయం అవుతాయి. ఒమక్టయా, మెట్కైనా తెగలను మీరు కలుస్తారు. పాండోరాలోనే ఇదొక విభిన్నమైన ప్రదేశం' అంటూ 'అవతార్ 3' నేపథ్యం గురించి జేమ్స్ కామెరూన్ క్లారిటీ ఇచ్చారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886